


జోడు రమేష్ కుమార్
చీఫ్ బ్యూరో
+91 99592 92159



KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

సంపుటి : 05 సంచిక : 207 పేజిలు : 08, వెల రూ. 5రూ/ ఆదివారం - 29 - డిసెంబర్- 2024

Ananthapuramu. Vijayawada. Tirupati. Visakhapatnam. tadepalligudem. Guntur. Kurnool. Nellore. Srikakulam. Rajamahendravaram. Kadapa. Ongole. Chittoor. Hyderabad. mahabubnagar. Warangal. Khammam. Nalgonda. Nizamaba


## నాలుగో టెస్టులో సెంచరీ సాధించిన తెలుగు కుర్రాడు




విశాఖపట్నం యువకుడికి అభినందనలు అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్

దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేయాలంటూ ఆకాంక్షించిన ముఖ్యమంత్రి

అద్భుత ప్రదర్శన చేశాడంటూ విక్టరీ వెంకటేశ్ ప్రశంసల జల్లు

## ఎల్లుండి తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం




మన్మోహన్ మృతి పట్ల సంతాపం ప్రకటించనున్న అసెంబ్లీ

మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించనున్న తెలంగాణ అసెంబ్లీ

ఎల్లుండి మంత్రివర్గ సమావేశం వాయిదా

తెలంగాణ అసెంబ్లీ ఈ నెల 30న ప్రత్యేకంగా సమావేశం కానుంది. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఇటీవల ముగిశాయి. ఈ సమావేశాలు ముగిసిన కొన్నిరోజుల్లోనే తిరిగి ఒకరోజు అసెంబ్లీ సమావేశం జరగనుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రెండు రోజుల క్రితం తుది శ్వాస విడిచారు. మిగతా..2లో

## నేను ఎక్కడికీ పారిపోలేదు: పేర్ని నాని



లాయర్ల సూచన మేరకు మీడియా ముందుకు రాలేదన్న పేర్ని నాని

పోలీసు విచారణ కంటే సోషల్ మీడియాలో రచ్చ ఎక్కువయిందని అసహనం

తనను, తన కుమారుడిని అరెస్ట్ చేయాలని చూస్తున్నారని మండిపాటు

తాను పారిపోయానని తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మచిలీపట్నంలోనే ఉన్నానని... తన లాయర్ల సూచన మేరకే మీడియా మిగతా..2లో

## రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి తప్ప చేతల ముఖ్యమంత్రి కాదు..




- పిల్లలకు సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్టే..
- ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు.
- జీతం అగొచ్చు కానీ మెస్ బిల్లులు మాత్రం ఆగవు అన్న సీఎం మాట ఏమైందని నిలదీశారు.
- డిసెంబర్ 31 దావత్‌లను బంద్ చేసి.. ఆ డబ్బుతో హాస్టళ్లను దత్తత తీసుకోవాలని రాష్ట్రంలోని యూత్, యువజన సంఘాలకు పిలుపునిచ్చారు.

యువత ముందుకు వచ్చి హాస్టళ్లను దత్తత తీసుకొని పిల్లలకు సేవ చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

# రాజ్యాంగ రచనలో తెలుగువారి పాత్ర చిరస్మరణీయం



అమరావతి: రాజ్యాంగ రచనలో తెలుగువారి పాత్ర చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రముఖుల చిత్రాలు, చరిత్రను తెలిపేలా వినూత్నంగా అసెంబ్లీ క్యాలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకుందని.. దీంతో ఆనాటి రాజ్యాంగ రచనలో భాగస్వాములైన తెలుగు ప్రముఖులను స్మరించేలా క్యాలెండర్ రూపొందించినట్లు తెలిపారు. 2025 సంవత్సరానికి రూపొందించిన నూతన అసెంబ్లీ క్యాలెండర్‌ను తన నివాసంలో ఇవాళ (శనివారం) సీఎం చంద్రబాబు ఆవిష్క రించారు. గోబ్యాక్ సైమన్ అంటూ తెగువ చూపిన ధీరుడు టంగుటూరి ప్రకాశం పంతులు రాజ్యాంగ రచనలో భాగస్వామి కావడం గర్వకారణమని అన్నారు. రాజ్యాంగంలోని స్థానిక సంస్థలు, గవర్నర్ విచక్షణ అధికారాలు వంటి అంశాల రూపకల్పనలో సహాయ సహకారాలు టంగుటూరి ప్రకాశం పంతులు అందించారని చెప్పారు. బోగరాజు పట్టాభి సీతారామయ్య రాజ్యాంగ సభా సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా సేవలు అందించారని అన్నారు. దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ జాతీయ భాష, న్యాయవ్యవస్థ, స్వాతంత్ర్యం, మానవ అక్రమ రవాణాపై చేసిన కీలక సూచనలకు రాజ్యాంగ సభ ఆమోదం తెలిపిందని చెప్పారు. జాతీయ భాష గురించి మోటూరి సత్యనారాయణ, అధికార వికేంద్రీకరణ, అత్యవసర అధికారాలు రెండు సభలు ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుపై ఎన్జీ రంగా సూచనలు చేశారన్నారు. వీరితో పాటు వీసీ కేశవరావు, అల్లాడి కృష్ణస్వామి, మొసలికంటి తిరుమలరావు, కళా వెంకట్రావులు తమ వంతు సేవలు అందించారని గుర్తుచేశారు. ఇలాంటి వారి చిత్రపటాలతో అసెంబ్లీ క్యాలెండర్‌ను రూపొందించి ఆవిష్కరించడం సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు తో పాటు అసెంబ్లీ సెక్రెటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ హాజరయ్యారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభల నిర్వహణపై సీఎం చంద్రబాబు ట్విట్టర్ (ఎక్స్)లో ట్వీట్ చేశారు. విజయవాడలో ప్రపంచ తెలుగు రచయితల మహాస భలు నిర్వహిం చుకోవడం తెలుగు వారందరికీ గర్వ కారణమని చెప్పారు. మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తోన్న ఈ మహాసభలు జరిగే ప్రాంగణానికి, అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును పెట్టారని అన్నారు. ఆ మహానుభావుడు తెలుగు జాతి కోసం చేసిన అద్వితీయ త్యాగాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తోందని చెప్పారు. అలాగే ప్రధాన వేదికకు తెలుగు భాషాభివృద్ధి కోసం గణనీయ కృషి చేసిన రామోజీరావు పేరు పెట్టడం కూడా అభినందనీయమన్నారు. ఈ మహాసభలకు విచ్చేసిన అతిథులకు, పాల్గొంటున్న తెలుగుభాషాభిమానులకు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మహా సభలు విజయవంతం అవ్వాలని కోరుకుంటూ నిర్వాహకులకు సీఎం చద్రబాబు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆగ్రహం



- తమ పార్టీని ఎదుర్కొనే ధైర్యం లేక బీజేపీ... కాంగ్రెస్‌ను అడ్డుపెట్టుకుంటుందని విమర్శ
- ప్రజలకు అందిస్తున్న పథకాలను దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపాటు
- తయ పార్టీ ఇచ్చిన హామీలతో బీజేపీ భయపడుతోందని విమర్శ

ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక బీజేపీ... కాంగ్రెస్ పార్టీని అడ్డుపెట్టుకుంటుందని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మండిపడ్డారు.

## నేను ఈ వ్యక్తికి ఫ్యాన్ అయ్యాను: నారా లోకేశ్




- అచ్చం చంద్రబాబులా ఉన్న మిమిక్రీ ఆర్టిస్ట్
- ఒక పెళ్లి వేడుకలో అందరినీ ఆశ్చర్యపరిచిన వైనం
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో

ఏపీ ముఖ్యమంత్రిని ఇమిటేట్ చేసిన ఒక వ్యక్తి వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియో ఏపీ మంత్రి నారా లోకేశ్ వరకు చేరింది. ఈ వీడియోను తన ఎక్స్ ఖాతా ద్వారా షేర్ చేసిన లోకేశ్... తాను ఈ వ్యక్తికి ఫ్యాన్ అయ్యానని చెప్పారు. చంద్రబాబు మాదిరి కనిపించడానికి, మాట్లాడేందుకు ఎంత కష్టపడ్డాడో చూడండని అన్నారు. ఇటీవల ఒక పెళ్లి వేడుకకు ఒక మిమిక్రీ ఆర్టిస్టు అచ్చం చంద్రబాబు వేషధారణలో వచ్చారు. వేదికపైకి వచ్చి అందరికీ విక్టరీ సింబల్ చూపించారు. చంద్రబాబు మాదిరే మాట్లాడుతూ అక్కడున్న అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు.

# వారిని ఎలా నియంత్రించాలో తెలుసు.. చేసి చూపిస్తాం

"నేనున్నాను.. ధైర్యంగా ఉండమని" పవన్ భరోసా

- అధికారులపై దాడి చేయడం వైసీపీకి కొత్త కాదన్నారు.
- ఎవరి మీదైనా దాడి చేస్తే గత ప్రభుత్వంలా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.
- "మాకు మిమ్మల్నిఎలా నియంత్రించాలో తెలుసు.. చేసి చూపిస్తాం" అని స్పష్టం
- వైసీపీ నేతలకు అహంకారంతో కళ్ళు నెత్తికెక్కాయన్నారు.




కడప, డిసెంబర్ 28: రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబును డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పరామర్శించారు. కాసేపటి క్రితమే రిమ్స్‌కు చేరుకున్న డిప్యూటీసీ సీఎం.. ఎంపీడీవోను పరామర్శించి వైసీపీ నేతల దాడికి సంబంధించి బాధితుడిని, కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుడు ఎంపీడీఓ జవహర్ బాబుకు,

## అక్రమ నిర్మాణాలపై హైడ్రా మరింత దూకుడు




హైదరాబాద్: కొత్త సంవత్సరంలో హైడ్రా మరింత దూకుడు పెంచుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటాయని స్పష్టంచేశారు. చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతోందని అన్నారు. స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్‌గా ఉంటుందని తెలిపారు. చెరువులను అభివృద్ధి చేస్తూ.. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తామని స్పష్టం చేశారు. నిర్ధారణ అనంతరం అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. ఇందుకోసం 15 హైడ్రా బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై

## కవిత తెగ హడావుడి చేస్తున్నారు..

మీ నాయకత్వం వారికి అవసరమా

బీసీలతో అసలు కవితకు ఏం సంబంధమని ప్రశ్నించారు.

"కల్వకుంట్ల కవిత నాయకత్వంలో బీసీల సమస్యలను పరిష్కరించుకొనే కర్మ మాకు పట్టలేదు" అంటూ వ్యాఖ్యల

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమే ధ్యేయంగా కులగణన జరిగిందన్నారు.



హైదరాబాద్, డిసెంబర్ 28: బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల మిగతా..2లో

# వైసీపీ నేతలకు స్పష్టమైన వార్నింగ్




గాలివీడు

ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించిన పవన్

సిబ్బందికి ధైర్యం చెప్పిన డిప్యూటీ సీఎం

అవసరమైతే కడపలోనే తిష్టవేసి మిమ్మల్ని సరిచేస్తా అంటూ ఫైర్

అన్నమయ్య జిల్లా గాలివీడు గ్రామంలో నిన్న ఎంపీడీవో జవహర్ బాబుపై వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి దాడి చేసి తీవ్రంగా గాయపర్చడం తెలిసిందే. జవహర్ బాబు ప్రస్తుతం కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇవాళ కడప వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రిమ్స్ లో ఎంపీడీవో జవహర్ బాబును పరామర్శించారు. అనంతరం ఆయన గాలివీడు గ్రామానికి చేరుకున్నారు. దాడి జరిగిన ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఎంపీడీవో జవహర్ బాబుపై

## సినీ ప్రముఖులపై సంచలన వ్యాఖ్యలు చేసిన బొత్స సత్యనారాయణ



సినిమా రంగం వాళ్లు అవకాశ వాదులని ప్రజలు అనుకుంటున్నారని విమర్శించారు.

తెలుగుదేశం పార్టీ నేతలు లేనిపోనివి సృష్టిస్తారని..

తప్పు జరిగితే తోలు తీస్తానన్న పవన్ కల్యాణ్ మాటలు ఏమైపోయాయన్నారు.

విశాఖపట్నం: సినీ ప్రముఖులపై మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిను, మిగతా..2లో

# ఆ బిల్లులు విడుదల చేయాలి...

## హరీష్‌రావు షాకింగ్ కామెంట్స్

- సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పిన మాటలకే దిక్కు లేదు..
- విద్యార్థులకు పెంచిన మెస్ చార్జీలను రేవంత్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం
- ముఖ్యమంత్రి మాటలు ఉత్తుత్తి మాటలని.. అమలు కావడం లేదని హరీష్‌రావు విమర్శించారు.




సిద్దిపేట జిల్లా: మెస్ చార్జీలు విడుదల చేయడంలో రేవంత్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 4 నెలల మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని ఎప్పుడు విడుదల చేస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ మాటలు కోటలు దాటుతున్నావి.. చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పిన మాటలకే దిక్కు లేదు..మెస్ చార్జీలు ఇంకా ఎందుకు పెంచడంలేదని ప్రశ్నించారు. విద్యార్థులకు పెంచిన మెస్ చార్జీలను రేవంత్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖలో విలువ లేదన్నారు. ముఖ్యమంత్రి మాటలు ఉత్తుత్తి మాటలని.. అమలు కావడం లేదని హరీష్‌రావు విమర్శించారు. సిద్దిపేట నాసర్‌పురాలోని మిగతా..2లో

కదిలించే వార్త తెలుగు దినపత్రిక
ఆదివారం - 29 - డిసెంబర్- 2024

# ఆ బిల్లులు విడుదల చేయాలి...

రెసిడెన్షియల్ (బ్రిడ్జ్ పాఠశాలలో ఇవాళ(శనివారం) విద్యార్థులకు హరీష్‌రావు దుప్పట్లు పంపిణీ చేశారు. పవనసుత యూత్ సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ చేశారు. రాష్ట్రంలో ఉన్న యూత్ , ఎన్. జి.ఓలు ఏదో ఒక స్కూల్‌ను దత్తత తీసుకుని సేవా చేయాలని పిలుపునిచ్చారు. నవంబర్ వరకు రేవంత్ ప్రభుత్వం మెస్ ఛార్జీలు ఇవ్వాలని కోరారు. కాస్మొటిక్ చార్జీలు రూ. 200కు పెంచాలని డిమాండ్ చేశారు. పీఎం అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇచ్చిన..రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని అబద్ధాలే చెబుతున్నారు..1వ తేదీన జీతాలు రావడం లేదు..10వ తేదీన మాత్రమే వస్తున్నాయని అన్నారు. ఉద్యోగులను సెస్పెండ్ చేయడం కాదు..ముఖ్యమంత్రినే సెస్పెండ్ చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖలపై రివ్యూ చేసుకోవాలని హరీష్‌రావు హితవు పలికారు. అంతకుముందు.. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో వేద భవన్‌లో జరిగిన శ్రీ గోదాదేవి కళ్యాణం, శ్రీ సుదర్శన యాగంలో హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. వికాస్ తరంగిణికి ప్రభుత్వం తరుపున ఎకరం స్థలం ఇచ్చి బిల్డింగ్ నిర్మించింది ఒక సిద్దిపేటలోనే అని తెలిపారు. నిధులు కేటాయించాలంటే రాష్ట్రంలో అధికారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేతిలో లేకపోవడంతో కొంత ఇబ్బంది అవుతుందన్నారు. త్వరలోనే సిద్దిపేట కోమటి చెరువు వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రూ. 10 కోట్లతో వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మిస్తామని హరీష్‌రావు తెలిపారు

## నాలుగో టెస్టులో సెంచరీ సాధించిన తెలుగు కుర్రాడు

భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య మెల్‌బోర్న్‌లోని ప్రతిష్ఠాత్మక ఎంసీజీ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్ మ్యాచ్‌లో అద్భుతమైన శతకం సాధించిన తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డిపై ప్రశంసలు జల్లు కురుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు కూడా నితీశ్‌కు అభినందనలు తెలిపారు. "నాలుగో టెస్టు మ్యాచ్‌లో సెంచరీ సాధించిన విశాఖపట్నం యువకుడు కె. నితీశ్ కుమార్ రెడ్డికి నా అభినందనలు. టెస్టు మ్యాచ్‌లలో ఈ ఘనత సాధించిన భారతీయ క్రికెటర్లలో మూడో అతి పిన్న వయస్కుడు కూడా కావడం మరింత సంతోషం కలిగిస్తోంది. రంజీలో ఆంధ్రా తరపున ఎన్నో విజయాలు సాధించిన నితీశ్ కుమార్ రెడ్డి... అండర్ 16లో కూడా అద్భుత విజయాలు అందుకున్నాడు. ఇలాంటి సెంచరీలు మరిన్ని సాధించాలని, భారత క్రికెట్ జట్టుకు చక్కటి ప్రదర్శన చేసి దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

### విక్టరీ వెంకటేశ్ ప్రశంసలు

ఇక క్రికెట్‌ను ఎంతగానో ఇష్టపడే టాలీవుడ్ అగ్రనటుడు విక్టరీ వెంకటేశ్ కూడా నితీశ్ కుమార్ రెడ్డిపై ప్రశంసల జల్లు కురిపించాడు. "అద్భుతమైన ప్రదర్శన చేశాడు. 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి సెంచరీ సాధించాడు. వాషింగ్టన్ సుందర్‌తో కలిసి అద్భుతమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. తొలి టెస్ట్ సిరీస్‌లోనే నితీశ్ అద్భుత ప్రదర్శన చాలా గర్వంగా ఉంది" అంటూ వెంకటేశ్ పేర్కొన్నాడు.

## బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆగ్రహం

ఢిల్లీలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఎల్‌జీ సెక్రటరియేట్ తాజాగా విచారణకు ఆదేశించింది. ఈ వ్యవహారంపై కేజ్రీవాల్ తీవ్రంగా స్పందించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమను అడ్డుకోవడానికే ఇవన్నీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రజలకు తమ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను దెబ్బతీసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాము మరోసారి గెలిస్తే మహిళా సమ్మాన్ యోజన కింద మహిళలకు ప్రతి నెల రూ.2,100 ఆర్థిక సాయం, సీనియర్ సిటిజన్లకు అన్ని ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించామని గుర్తు చేశారు. ఇందుకోసం ఇప్పటికే చాలామంది నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. తమ హామీలతో బీజేపీ భయపడుతోందని విమర్శించారు. ఈ పథకాలకు నమోదు ప్రక్రియకు అంతరాయం కలిగించడానికి గూండాలను కూడా పంపించారని ఆరోపించారు. బీజేపీకి మహిళలు, వృద్ధుల సంక్షేమం అవసరం లేనట్లుగా ఉందని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల విషయంలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని కాంగ్రెస్ నేత, ఢిల్లీ అసెంబ్లీ అభ్యర్థి సందీప్ దీక్షిత్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేయాలంటూ ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు ఎల్జీ సెక్రటేరియట్ లేఖ రాసింది. కాంగ్రెస్ లేఖ రాస్తే, గవర్నర్ విచారణకు అనుమతించడంపై కేజ్రీవాల్ మండిపడ్డారు.

## నేను ఎక్కడికీ పారిపోలేదు: పేర్ని నాని

ముందుకు రాలేదని చెప్పారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తమ గోడౌన్ లో బియ్యం బస్తాలు తగ్గాయని చెపితే... దానికి నగదు చెల్లించామని... అయినా కక్ష కట్టి తమపై కేసులు నమోదు చేశారని దుయ్యబట్టారు. ఏదీ తేలక ముందే తనను దొంగ అంటున్నారని చెప్పారు. పోలీసు విచారణ కంటే సోషల్ మీడియాలో రచ్చ ఎక్కువయిందని అసహనం వ్యక్తం చేశారు. జనవరి 2వ తేదీలోగా తనను, తన కుమారుడిని అరెస్ట్ చేయాలనే ప్లాన్ లో ఉన్నారని పేర్ని నాని చెప్పారు. ఈ నెల 30వ తేదీన బెయిల్ పిటిషన్ పై తీర్పు ఉన్నందున అన్ని విషయాల గురించి మాట్లాడలేకపోతున్నానని తెలిపారు. తమ అధినేత జగన్ కంటే ఎక్కువగా తనను టార్గెట్ చేస్తున్నారని చెప్పారు.

## ఎల్లుండి తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

మొదటి పేజి తరువాయి

ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. మన్మోహన్ సింగ్ మృతి పట్ల తెలంగాణ అసెంబ్లీ సమావేశమై సంతాపం ప్రకటించనుంది. సంతాప దినాల్లో భాగంగా దివంగత మన్మోహన్‌కు శాసనసభ నివాళులు అర్పించనుంది. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది తొలి సంతాప సభ.

మంత్రివర్గ సమావేశం వాయిదా

ఎల్లుండి అసెంబ్లీ అత్యవసర అసెంబ్లీ సమావేశం నేపథ్యంలో అదే రోజున జరగాల్సిన కేబినెట్ భేటీ వాయిదా పడింది.

## వైసీపీ నేతలకు స్పష్టమైన వార్నింగ్

మొదటి పేజి తరువాయి

వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి దాడి చేయడానికి దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతూ, ప్రభుత్వం అండగా ఉంటుందని, ధైర్యంగా పనిచేసుకోవాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ నేతలకు స్పష్టమైన హెచ్చరికలు చేశారు. ఎవరైనా సరే ఏ ఒక్క ప్రభుత్వ అధికారిపై జులుం చేసినా, ఇష్టంవచ్చినట్టు మాట్లాడినా మా సమాధానం కరాఖండీగా ఉంటుంది అని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నాను కాబట్టి పద్ధతిగా, ఎంతో జాగ్రత్తగా మాట్లాడుతున్నాను.... నా సహనాన్ని పరీక్షించవద్దు అని పేర్కొన్నారు. ఒకవైపు రాయలసీమ యువత ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు పోతుంటే, మరోవైపు మీరు దాడుల సంస్కృతి కొనసాగిస్తారా? అని పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇవాళ మేం అధికారులకు ధైర్యం ఇవ్వడానికి వచ్చాం. ఇక నుంచి వైసీపీ వాళ్లు ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడకపోయినా, సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్టు పిచ్చి కూతలు కూసినా, ఇలా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చి దాడులకు పాల్పడినా పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. జగన్... ధర్నాలు అని కల్లబొల్లి కబుర్లు చెప్పడం కాదు... మీ నాయకులను నిగ్రహంతో ఉండమని చెప్పు. సుదర్శన్ రెడ్డి మనుషులకు చెబుతున్నా... మీరు మళ్లీ ఇలాంటి పిచ్చి వేషాలు వేస్తే నేను కడపలో తిష్ట వేస్తాను. అవసరమైతే నా క్యాంప్ ఆఫీసును కడపలోనే ఏర్పాటు చేసుకుని, మిమ్మల్ని సరిచేసేంతవరకు ఇక్కడ్నించి కదలను. రాయలసీమ ఏ ఒక్కరి జాగీరు కాదు... ఏ ఒక్కరి కోట కాదు. మీ ఇష్టానుసారం వచ్చి గవర్నమెంటు ఆఫీసుల్లో దాడులు చేస్తాం, నోటికొచ్చినట్టు మాట్లాడతాం అంటూ చూస్తూ ఊరుకునేది లేదు. అన్ని పరిస్థితులకు రాటుదేలి ఇక్కడవరకు వచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు అధికారం ఉంది కదా అని అడ్డగోలుగా వ్యవహరించడం లేదు. మేం చాలా సంయమనంతో ఉన్నాం... మా సహనాన్ని పరీక్షించవద్దు. గత ఐదేళ్లలో మీరేం చేసినా చెల్లిందేమో కానీ, ఇంకా మీరు ఆధిపత్య ధోరణితో వ్యవహరించాలనుకుంటే ఇక నడవదు. ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి చేసిన 15 మందిని పట్టుకెళ్లి బొక్కలో పెట్టేంతవరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదు" అంటూ పవన్ గట్టిగా వార్నింగ్ ఇచ్చారు.

## సినీ ప్రముఖులపై సంచలన వ్యాఖ్యలు చేసిన బొత్స సత్యనారాయణ

మొదటి పేజి తరువాయి

ఇప్పుడూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరకు సినిమా ప్రముఖులు వెళ్లి కలిశారని చెప్పారు. సినిమా రంగం వాళ్లు అవకాశ వాదులని ప్రజలు అనుకుంటున్నారని విమర్శించారు. సినిమాల బెనిఫిట్ షోలు కావాలని తాను చెప్పను..వద్దని చెప్పను.. ఏ నిర్ణయాన్ని కూడా తాను చెప్పనని బొత్స సత్యనారాయణ అన్నారు. ప్రశ్నిస్తానని చెప్పిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఇప్పుడు ప్రభుత్వ తప్పులను ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రెండు సార్లు తనను కలిశారని.. పవన్ కల్యాణ్, నారా లోకేష్ కూడా గతంలో తనను కలిశారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ నేతలు లేనిపోనివి సృష్టిస్తారని.. మంత్రి శ్రీనివాస్ మీద ఎవరైతే ప్రచారం చేస్తున్నారో వాళ్లనే అడగాలని అన్నారు. శ్రీనివాస్‌ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తమ రాజకీయ ప్రత్యర్థి..శ్రీనివాస్ గెలిచింది.. నా తమ్ముడు మీద అని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్ పర్యటనలో నకిలీ ఐపీఎస్ వస్తే ఏం చేస్తున్నారని అన్నారు. తప్పు జరిగితే తోలు తీస్తానన్న పవన్ కల్యాణ్ మాటలు ఏమైపోయాయన్నారు. నకిలీ ఐపీఎస్ అధికారితో పోలీసులు ఫొటోలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు అంటే గౌరవం ఉంది..ఆయనకు పదవి వచ్చిన తర్వాత డీజీపీ అనే సంగతి మర్చిపోయారని విమర్శించారు. డీజీపీ తమ ఫోన్ ఎత్తడానికి కూడా భయపడిపోతున్నారని చెప్పారు. బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి అక్కడో మాట.. ఇక్కడో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. జమిలీ ఎన్నికలు వస్తాయని గతంలో చంద్రబాబు చెప్పారని.. తాము ఎప్పుడూ జమిలీ ఎన్నికల గురించి మాట్లాడలేదని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు.

విద్యుత్ చార్జీల భారం ప్రభుత్వమే భరించాలి..

విద్యుత్ చార్జీల పెంపు భారం ప్రభుత్వమే భరించాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. సూపర్-6 హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల పెంపు భారం ప్రజలపై వేయొద్దని చెప్పారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా..కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతోందని మండిపడ్డారు.

# వారిని ఎలా నియంత్రించాలో తెలుసు.. చేసి చూపిస్తాం

మొదటి పేజి తరువాయి



కుటుంబసభ్యులకు " నేనున్నాను.. ధైర్యంగా ఉండమని" పవన్ భరోసా ఇచ్చారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. అధికారులపై దాడి చేయడం వైసీపీకి కొత్త కాదన్నారు. ఇది వైసీపీ రాజ్యం అనుకుంటున్నారని మండిపడ్డారు. ఎంపీడీఓ జవహర్ బాబును అమానుషంగా కొట్టారని.. జవహర్ బాబుకు హైబీపీతో పాటు ఆరోగ్య సమస్యలు ఉన్నాయన్నారు. ఎవరి మీదైనా దాడి చేస్తే గత ప్రభుత్వంలా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇష్టారాజ్యంగా అధికారులపై దాడి చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఘటనా స్థలానికి సీఐ వెళ్తే తప్ప పరిస్థితి కంట్రోల్ కాలేదన్నారు. అహంకారంతో దాడి చేస్తే తోలు తీసి కూర్చోపెడతామని హెచ్చరించారు. వైసీపీ నేతలకు అహంకారంతో కళ్ళు నెత్తికెక్కాయన్నారు. ఇది కూటమి ప్రభుత్వం.. వైసీపీ కాదని గుర్తుపెట్టుకోవాలన్నారు. "మాకు మిమ్మల్నిఎలా నియంత్రించాలో తెలుసు.. చేసి చూపిస్తాం" అని స్పష్టం చేశారు. ఎస్సీ ఎస్టీ అని కాదు ఎవరైనా సరే ఆధిపత్యధోరణిలో ఎవరి మీద చేసినా ఇలాగే స్పందిస్తామన్నారు. పరారిలో ఉన్నవారి కోసం పోలీసులు గాలిస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు.

### కులం పేరుతో దూషణలా..

రాయలసీమలో మహిళలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీకి 11 సీట్లు వచ్చినా వారి అహంకారం తగ్గలేదన్నారు. కూటమి నాయకులు కూడా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. జవహర్ బాబును భయపెట్టి చంపుతాం అని బెదిరించారని.. ఇలాంటి నాయకులు ఎన్నికల్లో పాల్గొనాలి అంటే భయం రావాలన్నారు. జవహర్ బాబు కుటుంబానికి భరోసా ఇస్తున్నామన్నారు. ఒక మండలానికి అధికారిని కులం పేరుతో దూషించడం పరిపాటి అయిపోయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. పులివెందుల ప్రాంతంలో ఒక రైతుకుటుంబం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని.. రైతు కుటుంబం ఆత్మహత్యపై విచారణ జరుగుతోందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు. కాగా.. ఈరోజు ఉదయం గన్నవరం నుంచి కడప విమానాశ్రయానికి చేరుకున్న పవన్‌కు జిల్లా అధికారులు స్వాగతం పలికారు. కడప విమానాశ్రయం నుంచి రిమ్స్‌కు వెళ్లి.. గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును పవన్ కళ్యాణ్ పరామర్శించారు.

### ఈ పొలిటికల్ స్టార్‌కు బాగా కలిసొచ్చిన కాలం

### ఫోన్‌లో హోంమంత్రి పరామర్శ

అమరావతి: గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబును హోంమంత్రి అనిత ఫోన్‌లో పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న అధికారిపై దాడి చేయడంపట్ల హోంమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడితో మాట్లాడి దాడి ఘటనపై ఆరా తీశారు. దౌర్జన్యాలు, రౌడీ చర్యలకు పాల్పడితే రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. అధికారులు, సామాన్యులపై వైసీపీ నాయకుల దాడి.. వారి ఆధిపత్యం, అహంకారానికి నిదర్శనమని ఈ సందర్భంగా హోంమంత్రి అనిత వ్యాఖ్యలు చేశారు

# అక్రమ నిర్మాణాలపై హైడ్రా మరింత దూకుడు

మొదటి పేజి తరువాయి




హైడ్రా కఠినంగానే ఉంటుందని తేల్చిచెప్పారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. 2024 జూలై 19వ తేదీన హైడ్రా ఆవిర్భవించిందని అన్నారు. హైడ్రా 5 నెలల పని తీరు, వచ్చే ఏడాది కార్యాచరణను ప్రకటిస్తున్నామని రంగనాథ్ తెలిపారు. ఇవాళ(శనివారం) హైడ్రా కార్యాలయంలో రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. %హా==% లోపల.. 2050 కిలోమీటర్ల పరిధి.. తెలంగాణలో 33 శాతం హైడ్రా పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల భూమిని కాపాడిందని గుర్తుచేశారు. ఇప్పటివరకు 8 చెరువులు, 12 పార్కులను కాపాడామని అన్నారు. బఫర్ జోన్‌లపై ప్రజల్లో అవగాహన పెరిగిందని రంగనాథ్ పేర్కొన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా 1025 చెరువుల హద్దులను ఏర్పాటు చేస్తున్నామని రంగనాథ్ చెప్పారు. హైదరాబాద్‌లో హైడ్రా సమాచారం చేరవేయడం కోసం ఓ రేడియో ప్రారంభిస్తామని తెలిపారు. జూలై 19వ తేదీకు ముందు తర్వాత అక్రమ కట్టడాలను శాటిలైట్ ఇమేజ్ ద్వారా గుర్తిస్తున్నామని అన్నారు. అక్రమ నిర్మాణాలు కూల్చివేయడమే హైడ్రా పని కాదని.. 12 చెరువులను పునరుద్దరణ చేస్తున్నామని చెప్పారు.డీఆర్ఎఫ్‌లో 72 టీమ్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వరకు డీఆర్ఎఫ్ పని చేస్తుందన్నారు. కొంత మంది హైడ్రాపై అసత్య ప్రచారం చేస్తున్నారు.. దానిని ఖండిస్తున్నామని రంగనాథ్ అన్నారు.

### ఎఫ్‌టీఎల్ నిర్ధారణ..

"హైడ్రా ఏర్పడి దాదాపు 5 నెలలు దాటింది. ఐదు నెలల అనుభవాలు, వచ్చే ఏడాది రూట్ మ్యాప్ సిద్ధం చేశాం. వరకు హైడ్రా పరిధి ఉంది. జీహెచ్‌ఎంసీ చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను కేటాయించింది. 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించాం. 12 చెరువులు, 8 పార్కులను అన్యాక్రాంతం కాకుండా హైడ్రా కాపాడింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌పై ప్రజల్లో అవగాహన పెరిగింది.1095 చెరువుల్లో వచ్చే ఏడాది ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. సాంకేతిక పరిజ్ఞానం, డాటాతో ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తాం. ఎఫ్‌టీఎల్‌ను పారదర్శకంగా చేయడం మా బాధ్యత. శాటిలైట్ ఇమేజ్‌తో అత్యంత రెజల్యూషన్ ఉన్న డేటా తీసుకుంటున్నాం. 2006 నుంచి 2023 వరకు ఏరియల్ డ్రోన్స్‌తో తీసిన ఫొటోలను కూడా ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం తీసుకుంటున్నాం. ఎఫ్‌టీఎల్ మారడానికి గల కారణాలు స్పష్టంగా తెలుస్తుంది. శాస్త్రీయమైన పద్ధతుల్లోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ జరుగుతుంది. నాలాలపై కిర్లోస్కర్ కంపెనీ చేసిన స్టడీని తీసుకుంటున్నాం. 5800 ఫిర్యాదులు హైడ్రాకు అందాయి. అనధికారిక నిర్మాణాలకు సంబంధించి 27 పురపాలక సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి" అని రంగనాథ్ పేర్కొన్నారు.

### ఆక్రమణలపై చర్యలు..

"27 పురపాలక సంఘాలపై కూడా మాకు అధికారం ఉంది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నాం. భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై కూడా దృష్టి పెట్టాం. 2025లో జియో ఫెన్సింగ్ సర్వే చేస్తాం. 12 చెరువుల పునరుద్దరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే 72 డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయి. నాగోల్‌లో ఉన్న డీఆర్ఎఫ్ కేంద్రాన్ని బలోపేతం చేస్తాం. త్వరలోనే నగరంలో మరో డాప్లర్ వెదర్ రాడార్ రాబోతుంది. వెదర్ డాటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నాం. హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్ఎం ఛానల్‌కు ప్రయత్నిస్తున్నాం. హైడ్రా వల్ల ప్రజల్లో భూములు, ఇల్లు క్రయవిక్రయాలపై అవగాహన పెరుగుతుంది. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుంది. జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవాటిపై చర్యలు తప్పవు. వచ్చే ఏడాది నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న షెడ్లపై ప్రజలెవరు అద్దెకు తీసుకోవద్దు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నాం" అని రంగనాథ్ వెల్లడించారు.

# కవిత తెగ హడావుడి చేస్తున్నారు.. మీ నాయకత్వం వారికి అవసరమా

మొదటి పేజి తరువాయి



కవిత తెగ హడావిడి చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. బీసీలతో అసలు కవితకు ఏం సంబంధమని ప్రశ్నించారు. బీసీలపైన ముసలి కన్నీరు, కపట ప్రేమ కవిత చూపిస్తోందని మండిపడ్డారు. బీసీల గురించి ఆమె పోరాడాల్సిన అవసరం ఏముందని అడిగారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడే శక్తి బీసీలకు ఉందని.. బీసీ నాయకత్వంలో సమస్యలను పరిష్కరించుకుంటామని అన్నారు. "కల్వకుంట్ల కవిత నాయకత్వంలో బీసీల సమస్యలను పరిష్కరించుకొనే కర్మ మాకు పట్టలేదు" అంటూ వ్యాఖ్యలు చేశారు. కవిత నాయకత్వం బీసీలకు అవసరం లేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీల గురించి ఏనాడైనా కవిత మాట్లాడారా? అని నిలదీశారు. దేశానికి కులగణనలో తెలంగాణ రోల్ మోడల్‌గా మారిందని తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమే ధ్యేయంగా కులగణన జరిగిందన్నారు. రాహుల్ గాంధీ సూచనలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణన చేపట్టారని తెలిపారు. గిరిజనులు, మైనార్టీలకు12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్.. అప్పుడు బీసీల గురించి ఎందుకు మాట్లాడలేదని అన్నారు. పదేళ్లలో బీసీలను ఏనాడు పట్టించుకోలేదని.. ఏ కార్యక్రమాన్ని సరిగా అమలు చేయలేదని మండిపడ్డారు. బీసీ కార్పొరేషన్‌తో పాటు ఇతర కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని విమర్శించారు. బీసీకు రుణాలు ఇవ్వకుండా మొండి చేయి చూపించారన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక్క పైసా నిధులు ఇవ్వలేదన్నారు. బీసీలపైన బీఆర్ఎస్ పార్టీకి అంత ప్రేమ ఉంటే కులగణనను ఎందుకు ఆహ్వానించలేదని మరో ప్రశ్న వేశారు. కులగణనపైన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఎందుకు పాల్గొనలేదని అన్నారు. సామాజిక, ఉపాధి, విద్యా, రాజకీయంగా బీసీ వాటా కులగణనతో తేలిపోతుందని... దానికి అనుగుణంగా వాటా దక్కుతుందన్నారు.

### ఏపీలో ఈ ఏడాది క్రైమ్ రేట్‌పై డీజీపీ ఏం చెప్పారంటే..

రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తున్నట్లు కవిత ఆరోపణల్లో అర్థం లేదన్నారు. గందరగోళాన్ని సృష్టించడం కోసం ఆమె డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 3 వ తేదీన బహిరంగ సభ నిర్వహిస్తామని కవిత అంటున్నారని.. సభ నిర్వహించడానికి కవిత ఎవరు అంటూ విరుచుకుపడ్డారు. కవిత నాయకత్వంలో జరిగే సభకు బీసీలు ఎవరూ హాజరుకావొద్దని పిలుపునిచ్చారు. అగ్రకులాల చెప్పు చేతల్లో ఉద్యమాలు చేయాల్సిన కర్మ బీసీలకు లేదన్నారు. లిక్కర్ కేసును జనం దృష్టి మళ్లించడానికి కవిత బీసీ డ్రామాలు ఆడుతున్నారని విమర్శలు గుప్పించారు. లిక్కర్ దందాలో ఆరు నెలలు జైల్లో ఉండొచ్చిన కవిత నాయకత్వం బీసీలకు అవసరం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు అన్ని రకాలుగా న్యాయం చేస్తున్నారని.. బీసీ రిజర్వేషన్లు పెంచేది కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అని ప్రభుత్వ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి తప్ప చేతల ముఖ్యమంత్రి కాదు..

మొదటి పేజి తరువాయి

పిల్లలకు సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్టే.. మానవ సేవయే మాధవ సేవ అని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నాసరపుర కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూల్‌లోని విద్యార్థులకు స్వెటర్లు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. డిసెంబర్ 31 దావత్‌లను బంద్ చేసి.. ఆ డబ్బుతో హాస్టళ్లను దత్తత తీసుకోవాలని రాష్ట్రంలోని యూత్, యువజన సంఘాలకు పిలుపునిచ్చారు. చలికాలంలో హాస్టల్‌లో వేడి నీళ్లు రాక, ప్రభుత్వం దుప్పట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. గత 4 నెలల నుంచి మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ ఛానల్ పెట్టి రాష్ట్రంలో ఒక్క రూపాయి బిల్లు పెండింగ్ లేదని శాసన సభ సాక్షి గా చెప్పారని ప్రస్తావించారు. ఇదేనా గ్రీన్ ఛాలెంజ్ అని ప్రశ్నించారు. జీతం అగొచ్చు కానీ మెస్ బిల్లులు మాత్రం ఆగవు అన్న సీఎం మాట ఏమైందని నిలదీశారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ చేతలు గడప దాటడం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటల ముఖ్యమంత్రి తప్ప చేతల ముఖ్యమంత్రి కాదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పరిపాలన మీద పట్టు కోల్పోయారని.. ఈ ప్రభుత్వం ఫెయిల్ అనిపిస్తుందని చెప్పారు. అసెంబ్లీలో చెప్పిన మాటలు అమలు కాకపోవడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. మహాలక్ష్మి, తులం బంగారం ఎటు పోయాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి మాటలు అధికారులు వినడం లేదా లేక ముఖ్యమంత్రి ఉత్త మాటలు చెప్పానని అధికారులకు చెబుతున్నారా అని సందేహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అంటే అధికారులకు భయం లేదా విలువ లేదా.. గౌరవం లేదా అని నిలదీశారు. తక్షణమే అన్నిచోట్ల మెస్ చార్జీలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అన్ని శాఖలు మీ దగ్గర పెట్టుకొని ఎందుకు రివ్యూ చేయడం లేదని నిలదీశారు. ఢిల్లీ పైసలు ఇచ్చినా గల్లీ విడుదల చేయడం లేదని విమర్శించారు. రూ.1300కి పెంచిన మెస్ ఛార్జీలు ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. అర్బన్ రెసిడెన్షియల్‌లో రూ.1,050 మెస్ ఛార్జీలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు. 1 నుంచి 7 తరగతి వరకు 1300, ఎనిమిదో తరగతికి రూ.1500 మెస్ ఛార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాస్మోటిక్ ఛార్జీలు ఇంకా 100 రూపాయలు మాత్రమే ఇస్తున్నారని.. వాటిని150 రూపాయలకు పెంచి ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులకు దూరంగా రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉన్న విద్యార్థులపై ప్రభుత్వం మరింత బాధ్యతగా ఉండాలని హరీశ్‌రావు సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఏ విషయంలో కూడా మాట నిలుపుకోలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఏ విషయంలోనూ చెప్పిన మాటకు క్షేత్రస్థాయిలో పొంతన లేదని అన్నారు. అసెంబ్లీ లో చెప్పినట్లుగా తక్షణమే మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మాతృభాషపై తమిళనాడు తరహాలో చర్యలు తీసుకోండి



విజయవాడ, డిసెంబర్ 28: 6వ ప్రపంచ తెలుగు రచయితల మహా సభలో సుప్రీంకోర్టు పూర్వపు న్యాయమూర్తి జస్టిస్ యన్.వి.రమణ పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాష కీర్తి పతాకను ఎగుర వేసెలా సభలు నిర్వహిస్తున్న అందరికీ తెలుగు బిడ్డగా కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు సాహిత్యం, వైభవం గురించి అనర్గళంగా ఇక్కడ మాట్లాడారన్నారు. తెలుగు జాతి అంటే మదరాసీలు కాదని తెలుగు రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ప్రాణాలు విడిచారన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం రామోజీరావు ఎంతో కృషి చేశారని చెప్పుకొచ్చారు. వంద బిలియన్ల మన తెలుగు భాషను మాట్లాడుతుంటారని.. తెలుగు ఉనికి అతి ప్రాచీన భాషగా గుర్తింపు పొందిందన్నారు. పురాణాలు, ఇతిహాసాలు దాటి ప్రజల భాషగా తెలుగు భాష మారిందన్నారు. ఒక సంగీతం తరహాలో అందమైన భాష తెలుగు భాష అని కొనియాడారు. వ్యాపార, రాజకీయ ప్రయోజనాలతో తెలుగు భాషను అణగదొక్కారని విమర్శించారు. తగినంత గుర్తింపు కూడా భాషకు దక్కలేదన్నారు. వాడుక భాషలో మనం ఇంకా ప్రజలకు దగ్గర కాలేదని.. తెలుగు భాష వృద్ధిపై మన ప్రభుత్వాలు దృష్టి పెట్టింది లేదన్నారు. కొన్ని దేశాల్లో వారి మాతృభాషలో విద్యాబోధన చేసి అద్భుతాలు సాధించారని వెల్లడించారు. వారి సాంకేతికతను, విజయాలను వారి భాషలోనే రాసుకున్నాయన్నారు. భవిష్యత్తుతరాలకు మాతృభాషపై ఒక గౌరవం కలిగించాయన్నారు. ఆ తరహాలో మన తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. "పర భాషను నేర్చుకోండి... వ్యామోహం పెంచుకోకండి. నా సంస్కృతి నాశనం కాకుండా చూడాలని గాంధీజీ చెప్పేవారు. మాతృభాషలో విద్యను అభ్యసించి చాలా మంది ఉన్నత స్థితికి చేరారు. పెట్టుబడిదారులు ఇంగ్లీషు భాష ఉంటేనే ఉద్యోగాలు అనే పరిస్థితి కల్పించారు. తెలుగు భాషలోచదివి... దేశ విదేశాల్లో రాణిస్తున్న వారు ఎందరో. ప్రజా బాహిళ్యంలో మాతృభాషలోనే అన్ని నిర్ణయాలు ఉండాలి. ప్రభుత్వాలు కూడా తెలుగు భాషలోనే ఆదేశాల కాపీలు ఇచ్చే ఆలోచన చేయాలి. తెలుగు భాష వైభవం వల్లే తెలుగు రాష్ట్రాలకు కీర్తి ఉంటుంది. మన ఆచార, వ్యవహారాలు సక్రమంగా అమలు చేయాలి. అభివృద్ధితో పాటు భాషా సంస్కృతిని అలవాటు చేసుకోవాలి'' అని జస్టిస్ ఎన్వీ రమణ వెల్లడించారు.

# పులివెందుల మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

## పట్ల ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ఫైర్ నిరసనగా ధర్నా



పులివెందుల (కదిలించే వార్త) డిసెంబర్ 28 : పులివెందుల మున్సిపల్ అధికారులు శనివారం ఏర్పాటుచేసిన కౌన్సిల్ సమావేశానికి సమయానికి రాకపోవడం, కౌన్సిలర్లు కూడా సమయానికి హాజరు కాకపోవడం పట్ల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా మున్సిపల్ కార్యాలయ భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. సమయం 11:00 కావస్తున్న అధికారులు, కౌన్సిలర్లు ఎవరూ మీటింగ్ కు హాజరు కావకపోవడంతో సమావేశాన్ని బాయ్ కట్ చేయడం జరిగిందనీ ఎమ్మెల్సీ వెల్లడించారు

# అప్పుల బాధ తాళలేక రైతు కుటుంబం ఆత్మహత్య





సింహాద్రిపురం క్రైమ్ (కదిలించే వార్త) డిసెంబర్ 28 : సింహాద్రిపురం మండలంలో అప్పుల బాధ తాళలేక రైతు కుటుంబం బలవన్మరణంతో ఆత్మహత్యలు శుక్రవారం రాత్రి సంఘటన చోటు చేసుకోవడం జరిగింది. వివరాల్లోకి వెళితే దిద్దెకుంట గ్రామానికి చెందిన నాగేంద్ర, అతని భార్య వాణి అనే రైతు కుటుంబానికి ఒక కుమారుడు భార్గవ్ ఒక కుమార్తె గాయత్రి కలలని, మృతుడు నాగేంద్ర కుర్ర పంటను సాగు చేస్తున్నారని, మరియు ఒకటిన్నర ఎకరా భూమిలో చీని పంట సాగు చేస్తున్నారని, అంతేకాకుండా15 ఎకరాలు కౌలుకు తీసుకొని 8 ఏళ్లుగా వివిధ రకాల పంటలు సాగు చేశారు పంటలు కలిసి రాకపోవడంతో వీరి కుటుంబానికి అప్పుల బాధ భారమై, కుటుంబ సభ్యులతో కలిసి ఉరి వేసుకున్నట్టు గ్రామస్తులు సమాచారం తెలిపారు ఈ విషయాలపై డి.ఎస్.పి మురళి తన సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి ఆత్మహత్య గల కారణాలపై పూర్తిగా విచారణ చేపడుతున్నామని అంతేకాకుండా మృతుడు నాగేంద్రకు అప్పులు ఎవరెవరు ఇచ్చారు ఆ విషయాలు కూడా విచారణ చేస్తున్నామని, ఏది ఎనమైనప్పటికీ మృతి కారణం అప్పులేని తెలుస్తుందని, కుటుంబ సభ్యులతో కలిసి ఉరి వేసుకున్నట్టు సమాచారం తెలియజేశారు

## రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన

# రైతు కుటుంబ సభ్యుల ఆత్మహత్యలు



సింహాద్రిపురం(కదిలించే వార్త) డిసెంబర్ 28 : పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలంలోని దిద్దేకుంట గ్రామంలో నిన్న రాత్రి ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబ సబ్యుల మృతదేహాలను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రిలో లికడపజిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ తో కలిసి చూసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి వేంపల్లె మండల పరిశీలకుడు టీడీపీ సీనియర్ నేత రఘునాథరెడ్డి లి ఈ సందర్భంగా కడపజిల్లా కలెక్టర్ కి ప్రభుత్వం తరుపున ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని మారెడ్డి జోగిరెడ్డి , రఘునాథరెడ్డి విన్నవించారు. ఈ కార్యక్రమంలో మృతుల కుటుంబ సభ్యులు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## శ్రీ రంగనాథ స్వామి క్యాలెండర్ల ను

# ఆవిష్కరించిన చైర్మన్ సుధీకర్ రెడ్డి



పులివెందుల(కదిలించే వార్త) డిసెంబర్ 28 : పురాణ ప్రసిద్ధి చెందిన పులివెందులశ్రీ రంగనాథ స్వామి వారి 2025 నూతన క్యాలెండర్ లను శనివారం స్థానిక శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి లాంచనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతన చరిత్ర కలిగిన శ్రీ రంగనాథ స్వామి వారి క్యాలెండర్ ను రూపొందించడంలో కృషి చేసిన శ్రీ రంగనాథ ట్రస్ట్ చైర్మన్ అభినందించారు. క్యాలెండర్ లు ఆలయంలో భక్తులకు అందుబాటులో ఉంటాయని ఆయన వెల్లడించారు. రాబోయే నూతన సంవత్సరం మరియు ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం పలు వసతి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ముక్కోటి ఏకాదశి పండుగ సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ముక్కోటి ఏకాదశి నాడు స్వామి వారి కళ్యాణం ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి కొట్టే వెంకటరమణ, శ్రీ రంగనాథ ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణ రాజేష్ శర్మ, రాజసింహ శర్మ,శ్రీ రంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు, ప్రతినిధులు కూరగాయల ప్రసాద్, బాబు ,గంటా సుబ్బరాయుడు, ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు, పాల్గొన్నారు.

# వీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



సింహాద్రిపురం (కదిలించే వార్త) డిసెంబర్ 28 : సింహాద్రిపురం గ్రామంలో అతి పురాతనమైన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస శనివారం ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయాస్తమాన స్వామివారికి పంచామృతాభిషేకం సహస్రనామార్చన తదితర పూజా కార్యక్రమాల అనంతరం ఆంజనేయ స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనాన్ని కలిగించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ ఈ ఆంజనేయస్వామి ఆలయం అతి పురాతనమైనదని భక్తులు ఎంతో నమ్మకంతో వచ్చి స్వామివారి కార్యకర్తలతో మొక్కలు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



పులివెందుల (కదిలించే వార్త) డిసెంబర్ 28 : పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ , మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, రెండవ వైస్ చైర్మన్ హాఫీజ్ , మరియు మున్సిపల్ కమిషనర్ రాముడు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అజెండాలోని అంశాలను కౌన్సిల్ సమావేశానికి హాజరైన 33 మంది కౌన్సిలర్లకు అజెండాలో పొందుపరిచిన పులివెందుల పురపాలక సంఘము 2024-25 సవరించిన బడ్జెట్ అంచనాలు మరియు 2025-2026 సంవత్సరపు బడ్జెట్ అంచనాలు కౌన్సిల్ వారి ఆమోదం నిమిత్తము అంశాలను చదివి వినిపించి ఆమోదాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, మహేశ్వర్ రెడ్డి, విజయ నాయుడు, రాజశేఖర్, లక్ష్మీ భార్గవి, లక్ష్మీ ప్రసన్న మరియు ఇతర కౌన్సిలర్లు కో ఆప్షన్ చంద్రమౌళి, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# చంద్రబాబు పాలనలో సాగునీటి రంగానికి స్వర్ణ యుగం -కాలవ ప్రకటన



గుమ్మగట్ట,(కదిలించే వార్త) డిసెంబర్ 28 : గుమ్మగట్ట(బీటీ ప్రాజెక్టు)చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో సాగునీటి రంగానికి తిరిగి స్వర్ణ యుగం ప్రారంభమైందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గుమ్మగట్ట మండలంలో బిటిపి ప్రాజెక్టు ఆయకట్టుకు శనివారం సాగునీటిని విడుదల చేసిన సందర్భంలో ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడారు. అయిదేళ్ల జగన్ రెడ్డి పాలనలో ఆటకెక్కిన జీడిపల్లి - బిటీపీ కాలువ పనులను త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామన్నారు. 2018లో ఈ ప్రాంత ప్రజల పట్ల ఉన్న ప్రేమ అభిమానంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.968 కోట్లు మంజూరు చేశారన్నారు. 2019 ఎన్నికల్లోపు దాదాపు 35శాతం పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. వైకాపా పాలనలో ఐదేళ్లు ఉత్పత్తి హామీలతో రైతాంగాన్ని జగన్ మభ్యపెడుతు వచ్చారని కాలవ ఏద్దేవా చేశారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం సభల్లో సీఎం హెూదాలో స్వయాన జగన్ ఇచ్చిన హామీలే అమలుకు నోచుకోకపోవడం సిగ్గుచేటన్నారు. జగన్ మోసపూరిత హామీలతో అర్ధాంతరంగా ఆగిపోయిన బిటిపికి కృష్ణ జలాల తరలింపు పనులు మరో సారి చంద్రబాబు నాయకత్వంలోని ఎన్ .డి.యే. ప్రభుత్వంలోనే త్వరలో పునప్రారంభించ బోతున్నందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇక్కడి రైతుల స్థితి గతులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే సురేంద్రబాబుతో కలసి ఇప్పటికే శాసనసభలో వివరించడం జరిగిందన్నారు. ఇటీవల జరిగిన నెమకల్లు పర్యటనలో సీఎం దృష్టికి మరోసారి సమస్య వివరించగా, నిధుల మంజూరుకు ఆయన అంగీకరించారన్నారు. అర్ధాంతరంగా ఆగిన పనులు తిరిగి ప్రారంభించి రాబోయే రెండున్నర ఏళ్లలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల ఉజ్వల భవిష్యత్తు దిశగా ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా పని చేస్తుందన్నారు. మేము ఏదైనా చేయలేకపోతే ప్రజలకు దండం పెట్టిపోతాం మినహా జగన్ లాగా తప్పుడు హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేయమని కాలవ స్పష్టం చేశారు. బిటీపీ ప్రాజెక్ట్ నిధుల మంజూరుకు సురేంద్రబాబుతో కలసి సీఎం తో పాటు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులను కూడా కలవడం జరిగిందన్నారు. మరోసారి ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణతో కలిసి సీఎం, మంత్రుల సహాయ సహకారాలతో ప్రాజెక్టు పనులు తప్పక ముందుకు తీసుకెళ్ళతామన్నారు. తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని, ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. బిటిపికి ఈ సీజన్లో సాగునీరు విడుదల చేసే అద్భుతమైన అవకాశం రావడం నిజంగా తమ అదృష్టంగా బావిస్తున్నామన్నారు. సాగునీటి పంపిణీ నష్టాలపై అధికారులు ఒకటికి రెండు సార్లు



లెక్కలు వేసుకుని ఎంత ఆయకట్టుకు నీరు ఇవ్వగలరో ముందే నిర్ధారించాలన్నారు. సాగు విస్తీర్ణం కాస్త తగ్గినా పర్వలేదు కానీ, పంట ఆఖరిలో నీరులేక ఎండిపోయే పరిస్థితి మాత్రం తేవద్దని హెచ్చరించారు. ఆయకట్టుదార్లకు అందుబాటులో ఉంటూ మెరుగైన దిగుబడి వచ్చేలా ప్రాజెక్టు అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజు, సుభాన్ లతోపాటు ఆయకట్టుదార్ల సంఘాల సభ్యులు సంపూర్ణ సహకారం అందిస్తారని విశ్వసిస్తున్నానన్నారు.

# కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలి



కనేకల్, (కదిలించే వార్త) డిసెంబర్ 28 : కనేకల్ మండలంలో సిపిఎం కార్యదర్శి కోరి నాగరాజు మాట్లాడుతూ అంబేద్కర్ పై అవమానకరమైనవ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీద చేసిన అవమానకరమైన వ్యాఖ్యలను సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని పత్రిక ముఖంగా తెలియజేశారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి పత్రిక పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కోరి నాగరాజు మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం ప్రకారం ఎన్నుకోబడిన ఒక కేంద్రమంత్రి స్థానంలో ఉన్న అమిత్ షా దేశ వ్యాప్తంగా అంబేద్కర్ను, భారత రాజ్యాంగాన్ని అభిమానించే రాజకీయ పార్టీలను ప్రజలను ఎగతాళి చేస్తూ అంబేద్కర్ పై అవమానకర వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సిపిఎం పార్టీతో సహా దేశం యావత్తు తీవ్రంగా ఖండిస్తున్నదని, అయినా అమిత్ షా, మోడీ మాత్రం ఏమి పట్టినట్లుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారిపై అమిత్ షా చేసిన వ్యాకల పట్ల ఏమాత్రం పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని, పైగా ప్రధాని మోడీ అమిత్ షా వ్యాఖ్యలను సమర్థిస్తూ మాట్లాడటం సిగ్గుచేటు అని మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అవమానించడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడం, పరోక్షంగా రాజ్యాంగాన్ని తిరస్కరించడమే అవుతుందని అన్నారు. మోడీ ప్రభుత్వం ఓవైపు రాజ్యాంగం గురించి నిత్యం జపం చేస్తూ మరోవైపు అదే రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే వామపక్ష పార్టీలు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి పై కేంద్ర హెూంమంత్రి చేసిన అవమానకర వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ డిసెంబర్ 30న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో అభ్యుదయ, వామపక్ష అభిమానులు, సామాజిక సంఘాల నాయకులు మరియు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని భారత రాజ్యాంగాన్ని గౌరవించే ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా పెద్ద సంఖ్యలో ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని భారత రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకడి శర్మ దాదా పీర్ , ఫక్రుద్దీన్, రంగా తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిసిటీ స్టంట్ కోసమే బాయకాట్

# చేసిన ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి

కౌన్సిల్ సమావేశ సమయానికే ముందే వచ్చి ఎవరు రాలేదు అని చెప్పడం హాస్యాస్పదం

మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



పులివెందుల (కదిలించే వార్త) డిసెంబర్ 28 : పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి తెలిపిన సమయము కంటే ముందుగానే ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి వచ్చి మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఎవరు రాలేదని కేవలం పబ్లిసిటీ స్టంట్ కోసమే కౌన్సిల్ సమావేశాన్ని బాయ్ కాట్ చేసాము అని చెప్పడం విడ్డూరంగా ఉందని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పత్రికాముఖంగా తెలియజేస్తూ అజెండా లో చెప్పిన విధంగా ఒక 20 నిమిషాలకు కౌన్సిల్ ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్సీ అందరి కంటే ముందే వచ్చి ఇంకా ఎవ్వరు రాలేదు అని చెప్పటం హాస్యాస్పదం ఉందని, గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సమావేశానికి హాజరై కొన్ని హామీలు ఇవ్వడం జరిగింది. కాంట్రాక్టు బిల్స్ గురించి, అలాగే కొన్ని అభివృద్ధి పనుల గురించి నిధులు తెస్తాం..అని చెప్పడం జరిగింది..అయితే ఇప్పుడు గౌరవ కౌన్సిల్ సభ్యులు ఆ సమస్యలు మీద నిలదీస్తారని ఉద్దేశ్యం తో కొత్త వంత పాడుతూ బాయ్ కాట్ చేస్తున్నారు...పబ్లిసిటీ స్టంట్ కోసమే బాయకాట్ చేశారు తప్ప ఇంకోటి కాదు ,మీరు ఎప్పుడు కౌన్సిల్ మీటింగ్ కు వచ్చినా మిమ్మలని నిలదీస్తాం మీ వైఫల్యాలను ఎండగడతాం అని తెలియజేశారు

# సభ్యత్వాల నమోదు కోసం కొనసాగుతున్న విరాళాలు.

-50వేలు అందించిన 28వ డివిజన్ నాయకులు నారాయణమ్మ, గురు.

-ఎమ్మెల్యే దగ్గుపాటికి 50వేలు అందించిన నాయకులు.

-సభ్యత్వ నమోదు తుది దశలో ఉందన్న ఎమ్మెల్యే దగ్గుపాటి.



అనంతపురం (కదిలించే వార్త) డిసెంబర్ 28 : సభ్యత్వ నమోదు ప్రక్రియ తుది దశలో ఉందని.. నాయకులు మరింత యాక్టీవ్ గా పని చేయాల్సిన అవసరం ఉందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ నియోజకవర్గంలో సభ్యత్వాల నమోదు కోసం విరాళాలు కొనసాగుతున్నాయి. తాజాగా 28వ డివిజన్, అశోక్ నగర్ కు చెందిన టిడిపి నాయకురాలు నారాయణమ్మ, టిడిపి నాయకుడు గురు 50వేల రూపాయలు అందించారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటికి ఈ విరాళం అందించారు. ఈ సందర్భంగా నారాయణమ్మ, గురులను ఎమ్మెల్యే దగ్గుపాటి అభినందించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు మరికొన్ని రోజులు మాత్రమే ఉంటుందని.. ఇంకా తక్కువ శాతం ఉన్న ప్రాంతాల్లోని నాయకులు యాక్టీవ్ కావాల్సిన అవసరం ఉందన్నారు. మీ ప్రాంతాల్లో సభ్యత్వ నమోదు తక్కువగా ఉంటే ఇది మీ బాధ్యతేనని అన్నారు. సభ్యత నమోదును వేగంతం చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నారాయణస్వామి యాదవ్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, అశోక్ నగర్ టిడిపి నాయకులు నారాయణస్వామి, టిడిపి నగర కార్యదర్శి గోళ్ళ సుధాకర్ నాయుడు ఇతర టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గుంటి గంగమ్మ విగ్రహ ప్రతిష్ట...

సాహిత్య కళానృత్యాలతో కోలాహెూలం...

రోడ్డు లేని ఊర్లో గుడి నిర్మించడం చాలా మంచి కార్యక్రమం....

రోడ్డు సమస్యపై గత పాలకుల పలుమార్లు తెలిపిన పట్టించుకున్న పాపన పోలేదయ్యా...

రోడ్డు కావాలని కూటమి ఎమ్మెల్యే కందికుంట ని వేడుకుంటున్న గ్రామస్తులు...





తనకల్లు (కదిలించే వార్త) డిసెంబర్ 28 : మండల పరిధిలోని బొంతలపల్లి పంచాయతీ కొండకింద గ్రామం నందు శుక్రవారం రాత్రి గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామస్తులు కలిసికట్టుగా ఇంటిటికి చందాలు వేసుకొని గుంటి గంగమ్మ గుడి నిర్మించి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంబరాన్ని చాటేలాగా వివిధ కళానృత్యాలు చెక్కల భజన, కోలాటం ఏర్పాటు చేసి చుట్టూ ప్రక్కల గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. వచ్చిన భక్తులందరికి అన్నదాన కార్యక్రమం చేశామని గ్రామస్తులు తెలిపారు. కొండకింద ఊరికి దారి లేకా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ఏమైనా అత్యవసర సమయమైతే అంబులెన్స్ వచ్చేదానికి కూడా సరైన రహదారి లేదని అయినా ఇలాంటి ఊర్లో గుడి నిర్మించడం అనేది చాలా మంచి కార్యక్రమం అని పలువురు అభినందించారు.ఎందుకు మీ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదని అడగగా గత పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకున్నపాపానపోలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పుడున్న కూటమి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ వెంకట ప్రసాద్ స్పందించి ఏళ్ల తరబడి రోడ్డు లేక చాలా ఇబ్బంది పడుతున్న కొండకింద గ్రామానికి దారి ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నామని గ్రామస్తులు వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పితి శ్రీనివాసులు,వెంకటలక్ష్మి, రామంజులు ,శాంతమ్మ,దేరంగుల అలివేలు,శ్రీనివాసులు, ఇడగుట్ట క్రిష్ణమూర్తి, ముత్తన నారాయణ స్వామి, గుడిసె వెంకటేష్, భారతి, బత్తల సోమశేఖర్,క్రిష్టప్ప తదితర గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పప్పు శనగ పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు//



కనేకల్,(కదిలించే వార్త) డిసెంబర్ 28 : కనేకల్ మండలంలోని మాల్యాం గ్రామంలో శనివారం రోజున వ్యవసాయ అధికారులు శనగపప్పు పంటను పరిశీలించారు. శనగపప్పు గురించి వాటికి తెగల రోగం రాకుండా ఇంకా శెనగ చెట్టు పెరగడానికి తగిన సలహాలు రైతులకు తెలిపారు. రైతులకు శనగ పంట మీద ఇంకా ఏమైనా సలహాలు కావాలన్నా దగ్గరలోని వ్యవసాయ కేంద్రాలను సంప్రదించవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మరియు మాల్యాం లోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యోగి వేమనను దర్శించుకున్న జిల్లా ఎస్పీ రత్న.



గాండ్లపెంట మండలం (కదిలించే వార్త) డిసెంబర్ 28 : శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ రత్న గాండ్లపెంట మండలం లో పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని కటారుపల్లి గ్రామంలో ఉన్న ప్రజాకవి యోగివేమన ఆలయాన్ని జిల్లా ఎస్పీ సందర్శించారు. అనంతరం వేమన ఆలయంలో ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా ఎస్పీ రత్న నుకలిసి సన్మానించారు



# ఈతోడు గ్రామంలో పడకేసిన పారుశుద్యం

## ఊరి బోరు పైపులు లికేజితో మూసినదిలా వెళ్తున్న నీరు

## చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న పంచాయితీ అధికారులు




తనకల్లు (కదిలించే వార్త) **డిసెంబర్ 28 :** తనకల్లుమండల పరిధిలోని ఈతోడు గ్రామంలో గత నెల నుండి పైపులు లీకేజీ తో నీరు పురవీదులు గుండా వృధాగా పంచాయతీ సంబంధించిన నీరు ఒక నదిలా పారుతున్న కూడా పంచాయితీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారిస్తున్నారని గ్రామస్థులు బహిరంగంగా చర్చించుకున్నట్లు సమాచారం, ముక్యంగా బ్రతుకు జీవుడా అని కూలి నాలి చేసుకుంటూ ఉన్న కుటుంబంలో చిన్న పిల్లలు ఎక్కువగా ఉండడంతో మలేరియా, టైఫాడ్ మొదలగు వ్యాధులతో హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతున్నారని ఇవన్నీ స్థానిక పంచాయితీ కార్యాలయం కూతవేటు దూరంలో పైపులు లేకేజి అవుతున్న అదే దారిలో కార్యాలయానికి వచ్చే ద్విచక్ర వాహనాలు సైతం పోతున్నప్పటికి కూడా పరిస్థితి అంతా తెలిసినప్పటికి కూడా పంచాయితీ కార్యదర్శికి చలనం లేకపోవడం విడ్డురంగా ఉందని కాలిని వాసులు చర్చించు కుంటున్నట్లు సమాచారం.



ముక్యంగా ఈ లికేజి వ్యవహారం స్థానిక సర్పంచ్ కు, మరియు కార్యదర్శికి పలువురు కాలినివాసులు ఈ విషయం చెప్పినప్పటికి కూడా చేస్తాం చూస్తాం అని కల్లిబొల్లు మాటలు చెప్పి తపించుకుంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ఈతోడులోని పంచాయితీ పైపులైన్ లికేజి సమస్య పరిష్కారం చేయవలసిందిగా అటు పక్కన నివసిస్తున్న ప్రజలు వేడుకొంటున్నట్లు సమాచారం,త్వరగా ఈ పరిష్కారం కాకపోతే సోమవారం గ్రీవెన్స్ రోజు స్థానిక పంచాయితీ కార్యాలయం ముట్టడిస్తామని ఈ సందర్బంగా గ్రామస్తులు అక్కడ అక్కడ చర్చించికుంటున్నట్లు సమాచారం.

# లింగాల హైస్కూల్లో మండల స్థాయి విద్యార్థులకు ప్రదర్శన






లింగాల **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** లింగాల మండలంలోని ఎగువలింగాల జిల్లాపరిషత్ హైస్కూల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండలస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ రామకృష్ణయ్య ప్రారంభించారు. అలాగా ఆయన మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా" అబ్దుల్ కలాం స్పూర్తితో ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, విద్యార్థులందరిలో ఏదో ఒక నైపుణ్యం అంతర్గతంగా దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి వెలికి తీయడమే ఉత్తమ ఉపాధ్యాయుల కర్తవ్యమని, న్యూటన్, థామస్ ఆల్వా ఎడిసన్, సర్ సివి రామన్, ఐన్ స్టీన్ లాంటి శాస్త్రవేత్తలు మన మధ్యే ఉన్నారని , పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడమే ఉపాధ్యాయుల గురుతరబాధ్యత అని, లింగాల మండలవిద్యాశాఖ అధికారి రామకృష్ణయ్య పేర్కొన్నారు. అనంతరం వివిధ హైస్కూళ్ల విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, గణిత నమూనాలను పరిశీలించి తగు సూచనలు అందించారు. తదనంతరం అత్యుత్తమ నమూనాలు ప్రదర్శించిన ఇప్పట్ల ప్రతిభా గురుకుల బాలికల పాఠశాల, జిల్లాపరిషత్ హైస్కూల్ కోమన్నుతల, జిల్లాపరిషత్ హైస్కూల్ పెదకుడాల పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి, జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ కు ఎంపికయ్యారు. మండలస్థాయి విజేతలను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో లింగాల హైస్కూల్ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గజ్జల సురేష్ రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, రఘునాథరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నాగార్జున రెడ్డి, వీరభాస్కర్, సీఆర్పీలు జయచంద్రారెడ్డి, గంగరాజు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

# రైతుల ఖాతాలలో 76.36 కోట్ల రూపాయలు జమ

## జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



మంచిర్యాల, **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 28:- ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 319 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి 76 కోట్ల 36 లక్షల రూపాయల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 319 కొనుగోలు కేంద్రాల ద్వారా 64 వేల 126 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇందులో 19 వేల 220 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉందని, సంబంధిత 5259 మంది రైతుల ఖాతాలలో 76 కోట్ల 36 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 24 రైస్ మిల్లులకు సిఎంఆర్ అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 104 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి చేసి, మూసి వేయడం జరిగిందని, అకాల వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బండి సదానందం యాదవ్



మందమర్రి,**(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** పట్టణ పాత బస్టాండ్ వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కాంగ్రెస్ నేత, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ ఎన్నికయ్యారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో బండి సదానందం యాదవ్ ను అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత బస్టాండ్ లో నూతనంగా వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేల నుండి నిధులు తీసుకువచ్చి, వాకర్స్ కు సరైన సదుపాయాలు కల్పించడంతోపాటు మరింతగా అభివృద్ధి పనులు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. వాకింగ్ ట్రాక్, కొత్త వ్యాయామ పరికరాలు తీసుకోవచ్చి, వాకింగ్ ట్రాక్ ను నూతనంగా, సుందరంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తనను ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# తెదేపా సభ్యత్వ నమోదు



కనేకల్ **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** కనేకల్ మండలం అనకనాల గ్రామంలో ఈరోజు తెదేపా సభ్యత్వ నమోద కార్యక్రమం నిర్వహించారు మల్లికార్జున .నాగార్జున గ్రామంలో ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం లో పాల్గొని నమోదు చేయించారు నమోదు మొత్తం ఈరోజు 808 పూర్తి అయ్యాయి మిగతావన్నీ రెండు రోజుల్లో పూర్తి చేస్తామని ఎస్కే మల్కారిన వి నాగార్జున తెలిపారు, నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు హనుమంత రెడ్డి, నెరగన్నగారి వన్నూరుస్వామి,విజయ్ వాల్మీకి,లింగారెడ్డి,వసంత,మారెప్ప,దివాకర,నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

# రాప్తాడు నియోజకవర్గం ఏ ఐ వై ఎఫ్, నూతన్ సమితి ఎన్నిక పరిష్కరించండి.

## –జిల్లా సిపిఐ కార్యదర్శి సి. జాఫర్.




రాప్తాడు కదిలించే వార్త డిసెంబర్ 28 : నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకులు ప్రస్తుత సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య రాప్తాడు నియోజకవర్గం మహా సభ అనంతపురం సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ అధ్యక్షులు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మాజీ జిల్లా నాయకులు సీపీఐ జిల్లా కార్యదర్శి సీ.జాఫర్ మాట్లాడుతూ... వెనుకబడిన జిల్లాల నిరుద్యోగులకు ఏ ప్రభుత్వం వచ్చిన తీవ్ర అన్యాయం జరుగుతుందని చదువుకున్న విద్యార్థులకు సరైన ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు లేక జిల్లాల నుండి వలసలు పోతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత పక్క రాష్ట్రాలు వలసలకు పోయి చాలీచాలని జీతాలతో ఒక పూట తింటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశంలో పాలకవర్గ విధానాల వల్ల నిరుద్యోగ సమస్య పెరిగిందని. రాష్ట్రంలో మంచినీళ్లు కొరత ఉందేమో గాని మందు కొరత లేదని యువత గంజాయి డ్రగ్స్ వాడకంలో తలను నాశనం చేసుకుంటున్నారని డ్రగ్స్ గంజాయి నియంత్రణలో ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం చెందిందన్నారు . యువతను సన్మార్గంలో నడిచే విధంగా అఖిలభారత యువజన సమాఖ్య రాబోయే రోజుల్లో పని చేయాలని కోరారు యువతకు ఉపాధి కల్పనలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాజీ ఏ ఐ వై ఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ... యువతకు ఉపాధి దొరకకపోవడంతో దేశంలో ప్రతి రోజు 40 నుంచి 45మంది వరకు నిరుద్యోగులు స్వయం ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నేషనల్ క్రైమ్ బ్యూరో లెక్కలు చెబుతున్నాయి అని తెలిపారు. విద్య ,వైద్యం, ఉపాధి ,భారత రాజ్యాంగ ప్రాథమిక హక్కులు గా గుర్తించినా విద్య ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వ్యాపారంగా మారిందని వైద్యం మాఫియా వల్ల అందరికీ అందడంలేదని చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరకడం లేదని ఆరోపించారు. నూతన పరిశ్రమలలో యువతకు ఉపాధి, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చేయాలని కోరారు. ఏ ఐ వై ఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్ మాట్లాడుతూ... రాయదుర్గంలో నిర్వహించబడుతున్న ఏఐవైఎఫ్ 20 జిల్లా మహాసభల్లో రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలనీ, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని నిరుద్యోగ భృతి ఇవ్వాలని , ప్రభుత్వా శాఖల్లో ఖాళీ ఉన్నా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలనీ అన్నారు. ఎన్నో పోరాట ఫలితంగా సాధించిన విశాఖ ఉక్కు కర్మాగారం ప్రవేటికరణ కు వ్యతిరేకంగా మహిళలపై జరుగుతున్న దాడులకు ,వివిధ సామాజిక ,ఆర్థిక రాజకీయ, నూతన పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. కియా పరిశ్రమల్లో 70 శాతం మంది ఉపాధి కల్పనతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచర రూపొందించడం జరుగుతుందని తెలియజేశారు. అనంతరం అనంత జిల్లా ఏఐవైఎఫ్ రాప్తాడు నియోజకవర్గం నూతన సమితి అధ్యక్షుడు హరీష్, ఉప్పధ్యక్షులు మధు,గురు మోహన్, మణికంఠ, ప్రధానకార్యదర్శి ధనుజయ, సహాయ కార్యదర్శిలు శ్యామ్ ప్రసాద్, వంశీ, చందు 15 మంది తో కౌన్సిల్ సభ్యులను ప్రతిపాదన చేశారు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆత్మకూరు మండల సహాయ కార్యదర్శి సనప రామకృష్ణ, మాజీ ఏ ఐ వై ఫ్ నాయకులు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రశాంతమైన వాతావరణంలో

# నూతన సంవత్సర వేడుకలు

## మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ ఐపీఎస్




మంచిర్యాల, **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** జిల్లా ప్రతినిధి డిసెంబర్ 28:- ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, ఐపీఎస్ సూచించారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని మంచిర్యాల పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిసెంబర్ 31 రాత్రి ఎలాంటి ఇబ్బందికరమైన సంఘటనలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఇన్సిడెంట్ ఫ్రీగా, ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవడం కోసం ముందస్తు చర్యల్లో భాగంగా సమస్యాత్మక ప్రాంతాలు, ప్రధాన కూడలల్లో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్, ఆకస్మిక వాహన తనిఖీలు, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, సాయంత్రం సమయం నుండి విసేబుల్ పోలీసింగ్ ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నూతన సంవత్సర వేడుకల కోసం బయటకు పంపించి, ఇబ్బందులు పడవద్దని, పిల్లలను బయటకు వెళ్లకుండా శ్రద్ధ వహించి, వారిని పర్యవేక్షించి, కుటుంబ సమేతంగా ఇంట్లోనే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసిపి ఆర్ ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పల్లె రఘునాథ్ రెడ్డి,నూతన ఇంటి నిర్మాణం ఎంతో అద్భుతం ..



అనంతపురం**(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** పల్లె రఘునాథ్ రెడ్డి,నూతన ఇంటి నిర్మాణం ఎంతో అద్భుతం అని, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రశంసించారు.డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కుమారుడు పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి నీ ప్రశంసించిన పల్లె నూతన గృహ ప్రవేశం సందర్భంగా మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పల్లె సింధూర రెడ్డి,పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి దంపతులకు ఎమ్మెల్యేలు దగ్గుపాటి ,అమిలినేని సురేంద్ర బాబు, ఎంపీ పార్థసారథి,ఇతర ప్రజాప్రతినిధులు,మీడియా ప్రతినిధులు ,ఇతర ప్రభుత్వ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు గృహప్రవేశ కార్యక్రమం సందర్భంగా శనివారం పల్లె కుటుంబ సభ్యులను మర్యాద పూర్వకంగా కలిశారు. నిన్నటి రోజు అట్టహాసంగా మాజీ మంత్రి పల్లె గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఇవాళ పల్లె నూతన ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ పార్థసారథి, మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పీవీ కేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణ కిషోర్ రెడ్డి గారిని పలువురు టీడీపీ కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు,అధికారులు మర్యాద పూర్వకంగా కలసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇల్లు నిర్మాణం ఎంతో అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అన్నయ్యను సురేంద్రబాబు, ఎంపీ పార్థసారథిలను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి దంపతులు ఆప్యాయంగా పలకరించారు. పల్లె నివాసానికి ఎమ్మెల్యేలు,ఎంపీ రావడంతో సందడి వాతావరణం నెలకొంది.



# వైసీపీ ఆడుతున్న నాటకాలు ఇప్పటికైనా ఆపాలి.

-వైసిపి నాయకులు ధర్నాలు చేయాల్సింది రోడ్లపై కాదు జగన్ ఇంటి వద్ద

-అసలు విషయాలు తెలిస్తే.. ప్రజలు మిమ్మల్ని మరింత ఛీ కొడుతారు.

-వైసీపీ విద్యుత్ ఛార్జీల పోరుబాటపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఆగ్రహం.




అనంతపురం **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** వైసీపీ ఆడుతున్న నాటకాలు ఇప్పటికైనా ఆపాలి అని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి కార్యాలయంలో మీడియా సమావేశం పేర్కొన్నారు. జగన్ మోసాలు చేయడంలో, వంచించడంలో మొదటి నుంచి దిట్టనీ,2019లో అధికారంలోకి వచ్చి.. రాష్ట్రంలో వ్యవస్థల్ని సర్వ నాశనం చేశాడు ఈ విద్యుత్ ఛార్జీల పాపం ముమ్మాటికీ జగన్ దే,జగన్ అవినీతి వలన ఏపీ ప్రజలపై పడిన విద్యుత్ భారాలు లక్షా 29వేల కోట్లు,2014లో చంద్రబాబు వచ్చే నాటికి 22.5మిలియన్ యూనిట్ల లోటుతో విద్యుత్ ఉండేది అని ఎమ్మెల్యే తెలిపారు.2019లో టీడీపీ దిగిపోయే రోజుకు రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉంది.మిగులు విద్యుత్ నుంచి జగన్ నేడు విద్యుత్ కొరత సృష్టించారు జగన్ రెడ్డి అవినీతి, కక్షసాధింపు విధానాలతో విద్యుత్ రంగం మొత్తం దెబ్బతినింది.ఐదేళ్లలో 10సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై 32వేల కోట్లు నేరుగా భారం మోపారు.చేయాల్సిందంతా చేసివైసిపి పార్టీ ఈ పోరుబాట నాటకాలు ఆడుతున్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు..వైసిపి నాయకుల కుటిల మాటలను ఎవరు నమ్మే పరిస్థితి లేదుఅని .ఎమ్మెల్యే దగ్గుపాటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్మవరం ఏరియా హాస్పిటల్, పై విజిలెన్స్ అండ్ ఎంఫోర్సుమెంట్ అధికారుల ఆకస్మిక తనిఖీ



ధర్మవరం **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** అనంతపురము విజిలెన్స్ అండ్ ఎంఫోర్సుమెంట్ అధికారి అయిన వై బి పి టి ఏ,ప్రసాద్ వారి ఆదేశాలమేరకు విజిలెన్స్ అండ్ ఎంఫోర్సుమెంట్ అధికారులు ఏరియా హాస్పిటల్, ధర్మవరం టౌన్, శ్రీ సత్య సాయి జిల్లా పై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో సిబ్బంది పని తీరు మరియు వారి హాజరు వివరాలు సేకరించడం జరిగినది. అదే విధముగా కొద్ది మంది వైద్యులు సిబ్బంది హెడ్ క్వార్టర్స్ లో నివాసం లేకుండా వివిధ ప్రాంతాల నుండి విధులకు హాజరుకావడం గమనించడం జరిగినది. హాస్పిటల్ లోని టాయిలెట్స్, బాత్రూమ్లు మరియు వార్డులలో పరిశుభ్రముగా లేకపోవడం గమనించడం జరిగినది. కొన్ని విభాగాలలో టెక్నికల్ అసిస్టెంట్లు (స్కానింగ్ మరియు వివిధ పరీక్షల కొరకు) లేకపోవడంతో రోగుల





ఇబ్బందులను గమనించడం జరిగినది. కొన్ని విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్ పోస్ట్ లు ఖాళీగా ఉండడం గమనించడం జరిగినది. ఏరియా హాస్పిటల్, ధర్మవరం టౌన్, శ్రీ సత్య సాయి జిల్లా కు సంబందించిన నివేదికను సంబందిత పై అధికారులకు పంపించడం జరిగినది.ఈ తనీఖిలో అధికారులు డీస్పీ,ఎం. నాగభూషణంబీ సీఐ,ఎస్.జమాల్ బాషబీ ఏఒ,జే. వాసుప్రకాష్ మరియు సిబ్బందితో కలసి పాల్గొన్నారు.

# రైతుల ఖాతాలలో 76.36 కోట్ల రూపాయలు జమ

## జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్


మంచిర్యాల,**(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 319 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి 76 కోట్ల 36 లక్షల రూపాయల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 319 కొనుగోలు కేంద్రాల ద్వారా 64 వేల 126 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇందులో 19 వేల 220 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉందని, సంబంధిత 5259 మంది రైతుల ఖాతాలలో 76 కోట్ల 36 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 24 రైస్ మిల్లులకు సిఎంఆర్ అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 104 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తి చేసి, మూసి వేయడం జరిగిందని, అకాల వర్షాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



# జిల్లాలోని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లకు నెలవారీ సమీక్ష సమావేశం.




అనంతపురం **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డా.. అనుపమ జేమ్స్ అధ్యక్షతన జిల్లాలోని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లకు నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా డా.. అనుపమ జేమ్స్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల పరిధి నందు కుష్ఠ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని ప్రతి ఒక్క కేసును తొలిదశలోనే గుర్తించడం వల్ల. అంగవైకల్యం నుంచి రక్షించవచ్చని ,అలాగే కుష్ఠ వ్యాధి గురించి ప్రజలకు ఉన్న అనుమానాలు అపోహలు ను అవగాహనా కార్యక్రమాలు ద్వారా తొలగించాలని తెలిపారు . ముక్యంగా కుష్ఠ వ్యాధి అతి సాధారణ మైనదని. కుష్ఠ వ్యాధి ఏ దశలో వున్నా 6 నెలలు , లేదా 12 నెలలు. బహుళ ఔసుధ చికిత్సతో నయమతుందని తెలిపారు అలాగే అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల నందు మందులు ఉచితంగా లభిస్తా వని తెలిపారు . కుష్ఠ వ్యాధి వల్ల స్పర్శ కోల్పోయి అంగవైకల్యం ఏర్పడి వారు జిల్లా కుష్ఠ వ్యాధి అధికారి సంతకంతో ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టు కొంటె 6 వేల రూపాయల పెన్షను పొందవచ్చని అలాంటి అర్హత కలిగిన వారిని గుర్థించి వారికి సహకరించాలని సిబ్బందిని కోరారు ,అలాగే అంగవైకల్యం ఉన్నవారికి శాస్ర చికిత్సలు ద్వారా నయం చేయడం జరుగుతుందని తెలిపారు .ఈ సమావేశం నందు సిబ్బంది డా గంగాధర్ రెడ్డి , డా శివారెడ్డి ,పారామెడికల్. అధికారి. నాగన్న , హెఫ్ ఈ ఓ. సత్యనారాయణ , పారామెడికల్ అధికారులు , రాముడు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులు, విద్యుత్ గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు


1లక్షా 29వేల కోట్లు మీ హయాంలో ప్రజలపై భారం మోపారు

మీరు చేసిన పాపాలన్నీ ప్రజలకు శాపాలుగా మారుతున్నాయి

6నెలల్లోనే రైతులకు ఎంత మంచి చేశామన్నది వారినే అడగండి

వైసీపీ నిరసనలపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

వైసీపీ నాయకుల వాగుడు, కరపత్రం దుష్ప్రచారం ఇప్పటికైనా ఆపాలి



రాప్తాడు **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** అధికారంలో ఉండగా రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోకుండా. విద్యుత్ రంగాన్ని సర్వ నాశనం చేసిన వైసీపీ అధినేత జగన్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. విద్యుత్ ఛార్జీలపై వైసీపీ శుక్రవారం నిర్వహించిన నిరసనలపై ఆమె తీవ్రంగా స్పందించారు. రామగిరి మండలం వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. వైసీపీ నాయకులు చేపట్టిన నిరసన ఒక ఫ్లాప్ షోను తలపించిందని.. ప్రజల నుంచే కాకుండా సొంత పార్టీ నాయకులు కూడా ఈ నిరసనను పట్టించుకోలేదన్నారు. వాస్తవంగా వైసీపీ అధ్యక్షుడు జగన్ కి గానీ, ఆ పార్టీ నాయకులకు గానీ విద్యుత్ ఛార్జీల గురించి మాట్లాడే నైతికత లేదని సునీత అన్నారు. వైసీపీ హయాంలో సీఎం హోదాలో పెంచిన విద్యుత్తు చార్జీలను నిరసిస్తూ వారే నిరసనకు పిలుపునిచ్చారన్నారు. అసలు చంద్రబాబు నాయకత్వంలోని ఈ ప్రభుత్వానికి విద్యుత్తు చార్జీలు పెంచే ఆలోచన, అవసరం రెండు లేవన్నారు. 2019 నుంచి జగన్ ప్రభుత్వం ప్రజలపై 35వేల కోట్ల రూపాయల భారాన్ని వేసిందన్నారు. అంతేకాకుండా 1లక్ష 20వేల కోట్ల నష్టాల్లోకి విద్యుత్తు రంగాన్ని తోసేసిందన్నారు. గుట్టుచప్పుడు కాకుండా ఈఆర్‌సీకి ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలను జగన్ పంపారన్నారు. ఈ ప్రతిపాదనలు వచ్చిన 90 రోజుల్లోనే ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలపై నిర్ణయం తీసుకోవాల్సిన ఈఆర్‌సీ... ఎన్నికల దాకా ఆపారన్నారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే.. కూటమి ప్రభుత్వమే విద్యుత్ ఛార్జీలను పెంచిందని దుష్ప్రచారం చేస్తూ రోడ్డెక్కడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పారని.. దానికి ఇప్పటికీ ఆయన కట్టుబడి ఉన్నారని.. మీరు చేసిన పాపాలే ప్రజల్ని వెంటాడుతున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. మరోవైపు రైతులపై ప్రేమ ఉన్నట్టు వైసీపీ నాయకులు చేస్తున్న నాటకాలు చూస్తే సినీ నటులు కూడా పనికి రారన్నారు. గత ఐదేళ్లలో ఏ రోజైనా రైతుల గురించి ఆలోచించిన పాపాన పోని నాయకులు ఇప్పుడు రోడ్డెక్కి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రైతులకు ఎన్ని రకాలుగా మేలు చేశామో ఒక్కసారి వారినే అడిగితే తెలుస్తుందన్నారు. గత వారంలో ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాల్లోని 60మంది రైతులకు 60లక్షల డ్రిప్, స్ప్రింక్లర్లు ఇచ్చామన్నారు. మరో 8వందల మందికి పైగా రైతులకు సుమారు 8కోట్ల విలువ చేసే పరికరాలు త్వరలో ఇస్తామన్నారు. రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఇదే విధంగా ఆత్మకూరు, రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల్లో కూడా ఇస్తామన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే కూటమి ప్రభుత్వం రైతులకు ఏం చేసిందని వైసీపీ కర పత్రిక(సాక్షి) దుష్ప్రచారం చేస్తోందన్నారు. పింఛన్ వెయ్యి రూపాయలు పెంచుతామని చెప్పామని.. అధికారంలోకి వచ్చిన తొలి నెల నుంచి వెయ్యి రూపాయిలు పెంచి లబ్ధిదారుల ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. మీరు అదే వెయ్యి పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకున్నారన్నారు. మేము చెప్పిన ప్రతిహామీని నెరవేరుస్తున్నామని.. ఇప్పటికైనా వైసీపీ నాయకులు, వారి కర పత్రిక విష ప్రచారం మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని.. ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు.

## వరద బాధితుల సహాయార్థం విరాళం అందించిన, తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులు పెన్షనర్లు.





తిరుపతి **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** వరద బాధితుల సహాయార్థం తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులు, పెన్షనర్స్ ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడుని ఉండవల్లి నివాసంలో శనివారం కలిసి ఉద్యోగుల తరపున రూ. 1,18,36,798, పెన్షనర్స్ తరపున రూ. 71.59 లక్షల చెక్కును విరాళంగా అందించారు. వీరిని సీఎం అభినందించారు. అంతకముందు టీటీడీ అర్చకులు సీఎం చంద్రబాబును ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తప్పవు కఠిన చర్యలు

మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్, ఐపీఎస్

రౌడీ షీటర్స్, ట్రబుల్ మాంగర్స్ కి కౌన్సిలింగ్



మంచిర్యాల, **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన, ప్రజలకు ఇబ్బందులు కలిగించిన చట్టపరంగా చర్యలు తప్పవని మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ ఐపీఎస్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పోలీస్ స్టేషన్ లో స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్స్ కు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి ఏ భాస్కర్ మాట్లాడుతూ, ఈ నూతన సంవత్సర వేడుకలు ప్రజలందరూ జరుపుకోవడం కోసం, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ప్రజలు ఇబ్బందులు పడకుండా, కుటుంబ సమేతంగా తమ తమ ఇళ్లలో సంతోషంగా, చట్టబద్ధంగా నిర్వహించుకోవాలని షీటర్స్, ట్రబుల్ మాంగర్స్ లకు సూచించారు. వేడుకల వేళ మద్యం సేవించి, నిర్లక్ష్యంగా, మద్యం మత్తులో వేగంగా వాహనాలు నడపడం, ట్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయడం, దాడులకు, బెదిరింపులకు పాల్పడడం, రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురి చేసేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసిపి ఆర్ ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్, ఎస్ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసి భవన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కి వినతి :సాకేనరేష్



అనంతపురం, **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** నగరంలో బీసి భవన్ ఏర్పాటు చేయాలని బిసి రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకేనరేష్ ఆధ్వర్యంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కి తన కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా సాకేనరేష్ మాట్లాడుతూ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు బిసి భవన్ లేదని దీని ద్వారా అనేక ప్రాంతాలనుంచి వస్తున్న బీసీలు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేసారు, ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థలాన్ని పరిశీలిస్తున్నామని తొందరలో బిసి భవన్ నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి, బిసి నాయకుడు డి. కె. రామలింగ, శ్రీనివాసులు, మనోజ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసిన సంధ్యారాణి.



అనంతపురం, **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** వైసిపి అంగన్వాడీ విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన సంధ్యారాణితో పాటు పలువురు శెట్టూరు మండల నాయకులు శనివారం వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామి రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనంత వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అంతేకాకుండా అంగన్వాడీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని అనంత తెలియజేశారు.

## జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా,ఆర్. రామచంద్ర రెడ్డి.



అనంతపురం **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్, బోయ గిరిజమ్మని వారి ఛాంబర్ నందు, ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా నూతనంగా నియమితులైన ఆర్. రామచంద్ర రెడ్డి బోయ గిరిజమ్మ ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి ప్రజలతో మరియు ప్రజా ప్రతినిధులతో సమన్వయంగా కలిసి కట్టుగా పనిచేయాలని దిశా నిర్దేశం చేస్తూ, వారికి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ఉపముఖ్య కార్యనిర్వహణ అధికారి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

## ఇళ్లు లేని నిరుపేదలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0ని సద్వినియోగం చేసుకోండి


నగర ప్రజలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన



అనంతపురం **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్, మున్సిపల్ అధికారులతో సమావేశం ఇళ్లు లేని వారి వివరాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే దగ్గుపాటి గతంలో దరఖాస్తులు చేసుకుని ఇళ్లు అందని వారు వివరాలు సేకరించండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0పై అవగాహన కల్పించండి ప్రజలు స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఎమ్మెల్యే దగ్గుపాటి.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

వైయస్ఆర్సిపి ఎస్టీ సెల్ అనంతపురం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు నాయక్



అనంతపురం **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా ఎంపికైన ఎం.శ్రీనివాసులు నాయక్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల బోకేనందించి వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులుగా పదవిని అందజేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి మరియు ఆలూరు సాంబశివారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గిరిజన సమస్యలపై ఉద్యమాలు.పోరాటాలు చేస్తూ, వైఎస్ఆర్సిపి పార్టీలో ఎన్నో పదవులు పొంది ఈరోజు గిరిజన విభాగానికి జిల్లా అధ్యక్షుడుగా ఎన్నుకున్నందుకు మరొకసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నాము. నన్ను నమ్మి ఇంతటి పదవి బాధ్యతలు అప్పగించినందుకు నా గిరిజన జాతిని సంఘటితం చేసి వైఎస్ఆర్సిపి పార్టీ కోసం ఎంతో కృషి చేస్తానని అలాగే నా గిరిజన జాతికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెన్నంటే ఉంటానని హామీ ఇచ్చారు ఇప్పటినుంచి జిల్లాలో గిరిజన విభాగానికి బలోపేతానికి కృషి చేస్తానని నాలాగా ప్రతి ఒక్కరు లీడర్ కావాలని ఆయన పిలుపునిచ్చారు నియోజకవర్గాల మండలాల వారీగా అధ్యక్షులను నియమిస్తా శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బి కే యస్ జడ్పిటిసి నీలం భాస్కర్. వైస్ ఎంపీపీ సాకే లక్ష్మీనారాయణ. సుధీర్ నాయక్. గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు జి. మల్లికార్జున నాయక్. సోమ్లా నాయక్. గిరిజన ప్రజా సమాఖ్య నగర మహిళ అధ్యక్షురాలు శోభా బాయ్. గిరిజన ప్రజా సమాఖ్య రాయలసీమ జిల్లాల యువజన అధ్యక్షులు డి. భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రేడ్ యూనియన్ ను బలోపేతం చేయండి

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతను సన్మానించిన ఓబిరెడ్డి.




అనంతపురం, **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** జిల్లాలో ట్రేడ్ యూనియన్ ను బలోపేతం చేయాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి కి సూచించారు.వైసిపి ట్రేడ్ యూనియన్ విభాగం అనంతపురం జిల్లా నియమితులైన ఓబిరెడ్డి శనివారం వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామి రెడ్డిని ఆయన స్వగృహంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనంత వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ జెండాలోనే కార్మిక కలిగి ఉందన్నారు.కూటమి పాలనలో అన్ని వర్గాల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వైసీపీ తరపున ఆయా వర్గాలకు బాసటగా నిలవాలని సూచించారు.పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని అనంత తెలియజేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు,సైఫుల్లా బేగ్,కమల్ భూషణ్,నరసింహులు,నాయకులు చింతకుంట మధు,నాగార్జున రెడ్డి,కొర్రపాడు హుస్సేన్ పీరా,చిరంజీవి,బెస్త తిరుపాలు, మహేష్,సతీష్,దివాంజీ, నాగేంద్ర,సాకే మురళి, రామంజినేయులు ,రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గాలివీడు ఎంపీడీఓ జవహర్ బాబును పరామర్శించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్.



కడప **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాలివీడు ఎంపీడీఓ శ్రీ జవహర్ బాబును పరామర్శించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్. శ్రీ జవహర్ బాబు ఆరోగ్య పరిస్థితిని వైద్యుల్ని అడిగి తెలుసుకున్నారు.

## టిడిపి సభ్యత్వ మొత్తం చెల్లించిన, మల్లికార్జునరెడ్డి



ఆత్మకూరు **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** ఆత్మకూరు మండలం మదిగుబ్బ గ్రామమునకు సంబంధించిన తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సభ్యత్వ రుసుము మొత్తాన్ని మదిగుబ్బకు చెందిన మల్లికార్జునరెడ్డి ఒక్కరే చెల్లించారు. మండల టిడిపి ఇన్చార్జి బాలాజీకి సభ్యత్వానికి సంబంధించిన 50 వేల రూపాయలను మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు, శశాంక్ చౌదరి శనివారం అందచేశారు. ఈ కార్యక్రమంలో మదిగుబ్బ తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు దాలి నరసింహులు, సాగునీటి సంఘం చైర్మన్ రంగప్ప, రాజేంద్ర ,తదితరులు పాల్గొన్నారు. ఈ మొత్తాన్ని చెల్లించిన మల్లికార్జున రెడ్డికి గ్రామకమిటి సభ్యులు కృత్ణతలు తెలిపారు.

## ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తికి ఆర్థిక సాయం.



ఆత్మకూరు **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** ఆత్మకూరు మండలం బి.యాలేరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బ్రహ్మయ్య ఆచారి గుండె ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకులు మదిగుబ్బ మల్లికార్జున రెడ్డి శనివారం పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ధైర్యంగా ఉండాలని , అవసరమైనప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## గ్రామైక్య సంఘాలు బలోపేతం కావాలి.- పిడి ఈశ్వరయ్య



ఆత్మకూరు, **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** గ్రామైఖ్య సంఘాలు బలోపేతం కావాలని పిడి ఈశ్వరయ్య మహిళా సంఘాలకు సూచించారు. ఆత్మకూరులో శనివారం జరిగిన మండల సమాఖ్య ఈ సీ సమావేశానికి ప్రాజెక్టు డైరెక్టర్ బి ఈశ్వరయ్య విచ్చేసి మహిళాసంఘాలకు పలు సూచనలు చేశారు. సంఘ సభ్యులు బ్యాంకు లోన్లు, తీసుకొని పారిశ్రామి కవేత్తలుగా ఎదగాలని, లోన్లు రికవరీ బాగా కట్టాలని సంఘ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో డిపిఎం ఫైనాన్స్ సత్యనారాయణ, ఏరియా కోఆర్డినేటర్ టి సుభద్రమ్మ, శ్రీనిధి ఏజీఎం హనుమేష్' కెనరాబ్యాంక్ మేనేజర్ బాలకొండయ్య, యాంకర్ భాస్కర్ నాయుడు, ఏటీఎం పద్మావతి, సీసీలు వెంకట్ నారాయణ శ్రీరాములు, కొండయ్య, సాయి అంజలి, మండల సమాఖ్య ఓబీలు లక్ష్మమ్మ, భవాని, నాగలక్ష్మి, మండల సమాఖ్య అకౌంటెంట్ అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాలు హాజరయారు.

## ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0ని సద్వినియోగం చేసుకోండి.

-నగర ప్రజలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన.

-క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్, మున్సిపల్ అధికారులతో సమావేశం

-గతంలో జరిగిన నిర్మాణాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే దగ్గుపాటి.

-పీఎంఏవై అర్బన్ 2.0పై అవగాహన కల్పించాలని సూచన



అనంతపురం**(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** పట్టణ ప్రాంతాల్లో నివశిస్తూ పేదల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం చేపట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ పీడీ శైలజ, మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, డిఈ మధుసూదన్ రెడ్డి అధికారులతో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. గత ఐదేళ్లలో జరిగిన ఇళ్ల మంజూరు, ప్రస్తుతం వాటి నిర్మాణాలు, ఎన్ని ఇళ్లు పూర్తి చేశారన్న వివారాల గురించి ఆరా తీశారు. ఇంకా ఎంత మంది ఇళ్లు లేని వారు ఉన్నారు.. వారు దరఖాస్తులు చేసుకున్నారన్నది తెలుసుకున్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 వచ్చిన నేపథ్యంలో ఈ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పథకం యొక్క ఉద్దేశ్యాన్ని అలాగే ప్రజలకు కలిగే ప్రయోజనాలను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన (ఈ డబ్ల్యూ ఎస్), అల్ప ఆదాయ (యల్ ఐ జి) మధ్య తరగతి (ఎమ్ ఐ జి) కుటుంబాల సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు కేంద్రం "ప్రధాన మంత్రి ఆవాస్ యోజన"ను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పుడు ఈ పథకం రెండో దశ పీఎంఏవై -2.0ని ప్రారంభించిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివశించే వారు ఇది మంచి అవకాశం అన్నారు. ఈ పథకం గురించి నగర ప్రజలంతా తెలుసుకోవాలన్నారు. మీ దగ్గర్లో ఉన్న సచివాలయం ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు.

## రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం, **(కదిలించే వార్త) డిసెంబర్ 28 :** ఉరవకొండ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి అనంతపురం నగరంలోని రామ్ నగర్ లో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గంలో రహదారుల పరిస్థితిపై ఆర్.అండ్.బి అధికారులతో మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని ఆర్.అండ్.బి రహదారులు గుంతలు లేకుండా ఉండేలా చూడాలని, రహదారులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలను తక్షణం తీసుకోవాలన్నారు. రహదారుల అభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు అందుకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్.అండ్.బి ఎస్ఈ రాజగోపాల్, డిఈ బాల కాటమయ్య, ఏఈ కావ్య పాల్గొన్నారు.

కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# చరిత్ర మరచిపోని మంచిమనిషి

యూపీఏ రెండో ప్రభుత్వం వేసిన ప్రతి తప్పటడుగుకు నిందలు భరించడానికి బదులు ప్రధానమంత్రి పదవి నుంచి మన్మోహన్ నిష్క్రమించి ఉండవలసింది. ఆయన మంత్రిమండలి సభ్యులపై పోటెత్తిన అవినీతి ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్ఠను పూర్తిగా దిగజార్చాయి. అయినప్పటికీ చరిత్ర ఆయనపై తన తీర్పును చాలా అభిమానపూర్వకంగా ఇచ్చి తీరుతుంది, సందేహం లేదు. పాతిక సంవత్సరాల నాటి మాట. 1999లో డాక్టర్ మన్మోహన్ సింగ్ దక్షిణ ఢిల్లీ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు పోటీ చేశారు (లోక్‌సభకు ఆయన పోటీ చేయడం అదే మొదటిసారి, అదే చివరిసారి). ఆ ఎన్నికలలో ఆయన ఓడిపోయారు. అప్పుడు నేను ఎన్‌డీ టీవీలో పనిచేస్తున్నాను. 'ఫాలో ది లీడర్' 'అనే ఒక ఎన్నికల కార్యక్రమాన్ని మేము నిర్వహిస్తున్నాం. ఎన్నికలలో పోటీ చేస్తున్న ఒక నాయకుడి ప్రచారంలో ఒకరోజు పాటు ఆయన వెన్నంటి ఉండి వార్తా నివేదన చేయడం ఆ కార్యక్రమం ప్రత్యేకత. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రచార సరళిని కవర్ చేసే బాధ్యతను నాకు అప్పగించారు. నియోజకవర్గం పర్యటనలో మన్మోహన్ వెంట ఉండి మా కార్యక్రమానికి అవసరమైన సమాచారాన్ని సమకూర్చాలి. చెప్పినంత తేలిక కాదు ఈ పని. ఎందుకంటే ఆయన బిడియస్తుడు. పది మందిలో ఉండలేరు. టీవీ కెమెరాల ముందుకు రావడానికి సంకోచిస్తారు. మేము ఆ రోజు మొదటి సగాన్ని ఆయన గృహంలోనే గడిపాము ఆయనతో కలిసి ఉదయం ఉపాహారం తీసుకున్నాం. ఆ తరువాత ఆయన విస్తృత గ్రంథాలయంలో మాటా మంతీ జరిపాము. ఆ తరువాత మన్మోహన్ తన నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లినప్పుడు ఆయన వెంట వెళ్లాం. అక్కడ గుంపుల మధ్య ఉండవలసిరావడంతో ఆయన చాలా ఇబ్బందిపడ్డారు. తోపులాటలు, నెట్టుకోవడాలు ఆయనకు సుతరామూ నచ్చవు. అయినా ఆయన ఓపిక వహించారు. మంచి రోజులలోను, కష్టాలు చుట్టుముట్టిన రోజులలోను హుందాతనం కోల్పోకుండా మెలగడం ఎలా అన్నది మన్మోహన్ జీవితం నుంచి మనం నేర్చుకోవలిసిన పాఠం. ప్రజా జీవిత ఒత్తిళ్లు తన స్థితప్రజ్ఞతను ప్రభావితం చేసేందుకు ఆయన ఎన్నడూ అనుమతించ లేదు. విప్లవాత్మక కొత్త పుంతలు తొక్కిన భారత ఆర్థిక మంత్రి ఆయన. ప్రధానమంత్రిగా కీలక ఇండో%-% అమెరికా అణు ఒప్పందానికి ఆయనే ప్రధాన కారకుడు అయ్యారు. అయితే ఇందుకు ఆయన గానీ, ఆయన కుటుంబ సభ్యులుగానీ ఎటువంటి ప్రచారాన్నీ కోరుకోలేదు ఒక టీవీ షోలో భాగంగా 'సింగ్ ఈజ్ కింగ్' అనే పాటను ప్రసారం చేశాం. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి మాకు ఫోన్ వచ్చింది. అంత ఉల్లాస స్థితిని మరోసారి చూపించకుండా నివారించడం మంచిదని సూచించారు. మరో సందర్భంలో మన్మోహన్‌ను 'ఇండియన్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపిక చేశాం. ఒక ఫైవ్ స్టార్ హొటల్‌లో నిర్వహించదలిచిన ఆ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి రావడానికి నిరాకరిస్తూ దానిని తన ఇంటి వద్దనే స్వీకరించేందుకు ఆయన సంకోచిస్తూ అంగీకరించారు. 'నాకంటే ఎన్నో గొప్ప విజయాలు సాధించినవారు మరెందరో ఉన్నారని' ఆయన వినమ్రంగా ప్రతిస్పందించారు. స్వీయ ఉన్నతికి స్వీయ ప్రచారం చేసుకోవడమే నిపుణ రాజకీయ వ్యూహంగా పరిగణన పొందుతున్న ఈ కాలంలో ఎటువంటి పటాటోపాలు లేని మన్మోహన్ సింగ్ పాతకాలం నాయకుల సత్సంప్రదాయాలకు ప్రతినిధిగా కనిపిస్తారనడం సత్యదూరం కాదు. జాతి శ్రేయస్సుకు మౌనంగా పనిచేసిన ఉదాత్త నాయకుడు ఆయన. మన్మోహన్ తన వృత్తి జీవితంలో మొదటి నుంచీ నమ్మలేని రీతిలో నిర్దిష్ట పని గంటలకు మించి ఎక్కువగా పనిచేయడం అలవరచుకున్న వ్యక్తి. జీవితంలో చాలా కష్టపడి ఉన్నతస్థాయికి వచ్చినందున పనిపట్ల అతి నిష్ఠ, స్వీయ క్రమశిక్షణను తన విధి నిర్వహణలో అంతర్భాగం చేసుకున్నారు. ఆయనతో నా చివరి వ్యక్తిగత సమావేశాలలో ఒకసారి దేశ విభజన బీభత్సాల నుంచి తమ కుటుంబం ఎలా తప్పించుకున్నదీ వివరించారు. పేదరికంలో తాను పెరిగిన తీరు, ఉపకార వేతనాల ఆధారంగా విద్యాభ్యాసం చేయడం, విద్య ఆసరాతో ఉన్నత స్థాయికి ఎదగడం గురించి చెప్పారు. అప్పుడు ఆయన కొంచెం భావోద్వేగానికి లోనవడాన్ని గమనించాను. ఆయనలో అటువంటి భావోద్వేగ ధోరణి చాలా అరుదు. ఈ విషయాన్ని ఆయన భార్య కూడా గమనించినట్టున్నారు. వెంటనే మేమున్న గదిలోకి వచ్చి 'బస్ కరో, టీ తీసుకుందాం రండి' అని దృఢస్వరంతో అన్నారు. ఇంట శ్రీమతి మన్మోహనే బిగ్‌బాస్ అనేది స్పష్టం. తన తొలి సంవత్సరాల గురించి ఆయన భావోద్వేగంతో వివరిస్తున్నప్పుడు సువ్యక్తమవుతున్న ఆకాంక్షా భరిత, ప్రతిభాపాటవాలే చోదక శక్తిగా ప్రభవిస్తున్న 'నవ' భారత కథకు ఆయనే పూర్వగామి అన్న వాస్తవం నాకు స్ఫురించింది, ఆశ్చర్యపరిచింది. ఈ నూతన భారతదేశం ఆవిర్భవించేందుకు అద్వితీయంగా దోహదం చేసింది ఆయనే అన్న వాస్తవాన్ని చరిత్ర విస్మరించదు మన్మోహన్ యవ్వన కాలంలోని భారతదేశంలో కులీన విద్యాధిక వర్గాలకు వెలుపలి వారికి అవకాశాలు తక్కువగా ఉండేవి. చదువులో ప్రశస్తంగా ఉండడమే ఆనాటి వారికి సమాజంలో, ఎదుగుదలకు ఒక ప్రధాన మార్గంగా ఉండేది. డాక్టర్ మన్మోహన్ సింగ్ 'యాదృచ్ఛిక' 'ప్రధానమంత్రి కావచ్చు కాని ఆయన ఒక మెరిటోక్రాట్ (ప్రతిభా సంపన్నతతో ఎదిగిన వ్యక్తి). ఇది, మనం పొరపాటుపడడానికి వీలులేని ఒక నిశ్చిత సత్యం. తనకు లభించిన ప్రతి పరిమిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదిగారు. యువ మన్మోహన్ నాటి భారతదేశానికి 1991 అనంతర భారతదేశానికి మధ్య ఎంత వ్యత్యాసమున్నదో మనం విస్మరించకూడదు. ఆర్థిక మంత్రిగా, ప్రధానమంత్రిగా తన సాహసోపేత విధానాలతో తీర్చిదిద్దిన నేటి భారతదేశంలో ఎదుగుదలకు అనూహ్యమైన అవకాశాలు లభిస్తున్నాయి.

# పంటలను కాపాడుకునేందుకు పాట్లు

తర్లుపాడు వద్ద వర్షానికి తడిసిన మిర్చిని ఆరబెడుతున్న రైతులు

పొగాకు, శనగ, మినుముపై వర్ష ప్రభావం

పలుచోట్ల వరి ఓదెలు, కల్లాల్లో మిర్చిదీ అదే పరిస్థితి

మూడు రోజుల్లో 31.30 మి.మీ సగటు వర్షపాతం

నీరు బయటకు పెడుతూ, మిరపకాయలు ఆరబెడుతూ అవస్థలు

గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఎండలు కాస్తే మరింత నష్టం వెలుగు చూసే అవకాశం




జిల్లాలో మూడు రోజులపాటు కురిసిన వర్షాలు శుక్రవారం తెరపి ఇచ్చాయి. దీంతో పంటలను కాపాడుకొనేందుకు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. ఈ వర్షాల వల్ల లక్ష ఎకరాల్లోని పంట పొలాల్లో నీరు చేరింది. ప్రధానంగా పొగాకు, శనగ, మినుము నీటిలోనే ఉన్నాయి. కోత కోసిన వరి ఓదెలు, కల్లాల్లోని మిరపకాయలు దెబ్బతినే ప్రమాదం ఉండటంతో నీటిని తొలగించి నష్టాన్ని తగ్గించుకొనే ప్రయత్నాలను రైతులు చేస్తున్నారు. ప్రస్తుతం వర్షం ఆగి కొద్దిగా ఎండ వచ్చింది. మరో రెండు రోజులు ఎండ కాస్తే పంట నష్టాలు మరింత వెలుగు చూసే అవకాశం ఉంది. తాజా వర్షాలకు 11,505 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదించారు. ఒంగోలు, : జిల్లాలో మంగళ వారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షాలు శుక్రవారం తెల్లవారు జాము వరకు పడుతూనే ఉన్నాయి. గురువారం పగలు, రాత్రి తెరపి లేకుండా చాలాచోట్ల భారీ వర్షం కురిసింది. అలా మూ డు రోజుల్లో జిల్లాలో సగటున 31.30 మి.మీ వర్షపాతం నమో దైంది. అందులో మూడో రోజే ఏకంగా 20.20 మి.మీ కురిసింది. శుక్రవారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో పామూరు మం డలంలో అత్యధికంగా 80.60 మి.మీ వర్షపాతం నమోదైంది. కొత్తపట్నంలో 56.8, సీఎస్‌పురంలో 47.2, కొండపిలో 45.2, జరు గుమల్లిలో 38.40, టంగుటూరులో 38.20, సంతనూతలపాడుపొన్నలూరు, ఒంగోలు, కనిగిరి, సింగరాయకొండ, పీసీపల్లి, మార్కాపురం, మర్రిపూడి, పొదిలి, కొమరోలు, బేస్తవారపేట తదితర మండలాల్లో 15నుంచి 35 మి.మీ కురిసింది. ఈనెల తొలివారంలోనూ ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు పడ్డాయి. అనంతరం ఎండలు లేకుండా మంగు వాతావరణం కొనసాగడంతో చాలా చోట్ల పొలాలు ఆరలేదు. ఈ సమయంలో వరుసగా మూడు రోజులు ముసురు పట్టి పలు చోట్లభారీ వర్షాలు కురవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

### పంట పొలాలను ముంచెత్తిన వర్షపు నీరు

జిల్లావ్యాప్తంగా దాదాపు లక్ష ఎకరాల్లోని పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. కొన్ని ప్రాంతాల్లో పంటలను ముంచెత్తగా, మరికొన్ని చోట్ల నష్టపరిచేలా కనిపిస్తోంది. ప్రధానంగా పొగాకు, శనగ, మినుము పంటలు అత్యధిక విస్తీర్ణంలో నీటిలో ఉండిపోయాయి. చాలాచోట్ల కంది, కోసి ఉన్న వరి ఓదెలు నీటిలో తేలియాడుతున్నాయి. కోసి ఆరబోసిన మిరపకాయలు కల్లాల్లోనే తడిసిపోయాయి. శుక్రవారం వర్షం తెరపి ఇవ్వడంతో రైతులు పొలంలోని నీటిని బయటకు పంపి అవకాశం ఉన్న మేర పంటను రక్షించుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

### మినుము, లేత పొగాకు తోటలకు తీవ్ర నష్టం

ఎక్కువ ప్రాంతాల్లో మినుము, లేతశనగ, లేత పొగాకు తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాపు బాగా ఉన్న సమయంలో వర్షం కురవడంతో మినుము కాయలు ఉబ్బి పగిలిపోతున్నాయి. కొన్నిచోట్ల మొలకలు కూడా వస్తున్నాయి. తడిసిన వరి ఓదెల్లోనూ మొలకలు కనిపిస్తున్నాయి. లేత శనగ నీట మునిగి కుళ్లిపోతోంది. దీంతో ఆయా పంట పొలాల నుంచి నీటిని బయటకుపంపడంతోపాటు వరి ఓదెలను తిరగేయడం, కల్లాల్లోని మిరపకాయలను ఆరబెట్టడం వంటి పనుల్లో రైతులు నిమగ్నయ్యారు.

### గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు

జిల్లావ్యాప్తంగా పంటలు దెబ్బతినడంతో వ్యవసాయ. ఉద్యాన శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. జిల్లా వ్యవసాయ అ?ధికారి (డీఏవో) శ్రీనివాసరావు శుక్రవారం వెలిగండ్ల మండలంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఇతర మండలాల్లోనూ స్థానిక అధికారులు పొలాలను పరిశీలించి తక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేస్తున్నారు. ప్రస్తుతం వర్షం తెరపి ఇచ్చి కొద్దిగా ఎండ వచ్చింది. మరో రెండు రోజులు ఎండ కాస్తే పంట నష్టాలు మరింత వెలుగు చూసే అవకాశం ఉంది. ప్రస్తుతం పొలాల పరిస్థితిని పరిశీలిస్తే నష్టం భారీగానే ఉండే అవకాశం కనిపిస్తోంది.

# పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారుల మాటలు నమ్మకండి

ప్రభుత్వ ఉద్యోగాలు ఎప్పుడూ ప్రతిభ ఆధారంగానే వస్తాయని గుర్తుంచుకోండి

సాంకేతికతను జోడించి ప్రక్రియ యావత్తు పారదర్శకంగా జరిగేలా పటిష్ఠ చర్యలు చేపట్టాం

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

ఈవెంట్స్ జరిగే రోజుల్లో పోలీసులు విధించే ట్రాఫిక్ ఆంక్షలు పాటించి సహకరించాలని విజ్ఞప్తి

అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు బాగా ప్రాక్టీస్ చేసుకురావాలని విజ్ఞప్తి

జిల్లా ఎస్పీ పి.జగదీష్



అనంతపురం, **(కదిలించే వార్త) డిసెంబర్ 28:** పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ పి.జగదీష్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఎప్పుడూ ప్రతిభ ఆధారంగానే వస్తాయని గుర్తుంచుకోవాలన్నారు. ఈ ప్రక్రియ యావత్తు పారదర్శకంగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఈ ప్రక్రియలో వాడుతుండటం వల్ల ఎక్కడా అక్రమాలకు తావుండదనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను ఎవరైనా మోసం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు బాగా ప్రాక్టీస్ చేసుకురావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈనెల 30 నుండీ జనవరి 17 వరకు జరిగే ఈవెంట్స్ కు హాజరయ్యే అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులో నిర్దేశించిన తేదీల్లో ఉదయం 5 గంటలకు స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో హాజరు కావాలి. తమతో పాటు అడ్మిట్ కార్డ్, స్టేజ్-1, స్టేజ్-2 అప్లికేషన్ కాపీలు, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లు ఒరిజినల్స్ తీసుకురావడంతో పాటు ఒక సెట్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలి. ఈవెంట్స్ ఉన్న అభ్యర్థులు ఆయా నిర్ధేశిత తేదీలలో అనంతపురం పి.టి.సి తూర్పు గేటు నుండీ ప్రవేశించాలి అభ్యర్థులతో పాటు ఎవరైనా వెంట వచ్చినా పి.టి.సి కు తూర్పున ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ప్రారంభమయ్యే పాయింట్ వద్దే ఆగిపోవాలి. ఈవెంట్స్ జరిగే ప్రదేశానికి అనుమతి ఉండదు. అభ్యర్థొక్కరు మాత్రమే ఈవెంట్స్ ప్రదేశానికి రావాల్సి ఉంటుంది

### ట్రాఫిక్ ఆంక్షలు పాటించి ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలి

ఈనెల 30 వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుండి జనవరి 17 వ తేదీ వరకు పి.టి.సి కు తూర్పున ఉన్న మరియు రైల్వే ట్రాక్ కు ఆనుకుని ఉన్న రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. ఎలాంటి రాకపోకలు ఉండవు. ఈవెంట్స్ ముగిసే వరకు జరిగే అన్ని రోజుల్లోను పోలీసులు ఈ ఆంక్షలు అమలు చేయనున్నారు రాంనగర్, లక్ష్మీనగర్ మిట్టల మీదుగా మొదటి, రెండవ, మూడవ, తదితర రోడ్లకు వెళ్లే వాహనదారులు లక్ష్మీనగర్ నాగులకట్ట నుండీ సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్ మరియు జన్మభూమి రోడ్డుల మీదుగా నడిమివంకల మీదుగా వెళ్లాలి మొదటి, రెండవ, మూడవ, తదితర రోడ్ల నుండీ రాంనగర్, లక్ష్మీనగర్, రహమత్ నగర్ రైల్వే బ్రిడ్జి వైపు వెళ్లే వాహనదారులు పిటిసి ఉత్తరం వైపునున్న సర్వీసు రోడ్డు ద్వారా నడిమివంక, జన్మభూమిరోడ్డు, సంజీవరెడ్డి బిల్డింగ్ సర్కిల్ మీదుగా లక్ష్మీనగర్ నాగులకట్ట నుండీ వెళ్లాలన్నారు.

# గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

- పీఆర్ పరిధిలో రహదారులు, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం, **(కదిలించే వార్త) డిసెంబర్ 28:** ఉరవకొండ నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి అనంతపురం నగరంలోని రామ్ నగర్ లో ఉన్న మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గంలోని గ్రామాల్లో రహదారులు, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణంపై పంచాయతీ రాజ్ అధికారులతో మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో చేపడుతున్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో రహదారులు, సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. జనవరి నెలాఖరులోపు చేపట్టిన సిసి రోడ్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం ఈఈ ప్రభాకర్ రెడ్డి, డిఈ రసూల్, ఏఈలు రమణయ్య, రవీంద్ర పాల్గొన్నారు.

## 2024: విద్యార్థులకు గుడ్‌న్యూస్..

## నేటి నుంచి స్కూళ్లకు క్రిస్మస్ సెలవులు! మొత్తం ఎన్ని రోజులంటే



తెలుగు రాష్ట్రాల్లోని స్కూల్ విద్యార్థులకు నేటి నుంచి క్రిస్మస్ సెలవులు ప్రారంభం కానున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో క్రిస్మస్ సందర్భంగా సెలవులు ఇస్తూ ఇప్పటికే రెండు రాష్ట్రాల విద్యాశాఖలు ప్రకటనలు జారీ చేశాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాల్లో మంగళవారం నుంచే స్కూళ్లకు సెలవు ఇచ్చారు. క్రిస్మస్ ఈవ్ సందర్భంగా ఆప్షనల్ హాలిడే ఇస్తూ డీఈవోలు ఉత్తర్వులు జారీ చేశారు.మిగతా స్కూళ్లలో రేపు, ఎల్లుండి పబ్లిక్ హాలిడేలుగా ప్రకటించారు. దీంతో డిసెంబర్ 25, 26 తేదీల్లో పబ్లిక్ హాలీడేస్‌గా ప్రకటించారు. డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగ కాగా.. డిసెంబర్ 26న బాక్సింగ్ డే కావడంతో ఈ రెండు రోజులు స్కూళ్లు, కాలేజీలతోపాటు బ్యాంకులు ప్రభుత్వ ఆఫీసులకు సెలవులు ఇచ్చారు. ఏపీలో రేపు పబ్లిక్ హాలీడే ఉండగా 26న ఆప్షనల్ హాలిడేగా ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి డిసెంబర్ 27వ తేదీన బడులు, కాలేజీలు పునఃప్రారంభంకానున్నాయి.కిస్మస్ సెలవుల తర్వాత జనవరి నెలలో మళ్లీ వరుసగా సెలవులు వస్తున్నాయి. ఈనెలలో మొత్తం 31రోజులు ఉండగా.. అందులో 9 రోజులు సెలవులు వస్తున్నాయి. పాఠశాలలు, కాలేజీలకు ఈ 9 రోజులు సెలవులు ఉండనున్నాయి. జనవరి 2025లో కేవలం 22 రోజులు మాత్రమే పాఠశాలలు, కాలేజీలు తెరచి ఉంటాయి. జనవరి 5, 12, 19, 26 తేదీల్లో ఆదివారం సెలవులు ఉన్నాయి. ఇక జనవరి నెల సంక్రాంతి పండగ సందర్భంగా సంక్రాంతి సెలవులుకూడా రానున్నాయి. ఆదివారం (జనవరి 12) నుంచి కనుమ వరకు స్కూళ్లకు సెలవులు రానున్నాయి

## చోరీ కేసుల కోసం లాయర్‌ని పెట్టుకున్న దొంగ ఇంటికెళ్తూ లాయర్ బైక్‌నే ఎత్తుకెళ్లాడు! కట్‌చేస్తే..

ఓ కేటుగాడు అన్నం పెట్టిన చేతికే సున్నం పెట్టాడని చూశాడు. కష్టపడకుండా డబ్బులు సంపాదించాలనుకున్నాడు ఓ కేటుగాడు. ఇలా బైక్‌ల దొంగతనంలో రాటు తేలిపోయాడు. కొట్టేసిన బైకులను



ఏంచక్కా అమ్మేసి జల్సాలు చేసుకునే వాడు. మనోడి ట్యాలెంట్ ఏ రేంజ్‌లో ఉండేదంటే.. చివరాకరికి సీసీటీవీలకు కూడా దొరకలేదు. కన్ను పడిందంటే చాలు.. తాళాలు వేసినా.. వేయకపోయినా చిటికెలో బైక్‌లను మాయం చేసేస్తాడు. అయితే ఈ మహామాయగాడి యవ్వారం ఓ చిన్న తప్పుతో బట్టబయలైంది. తన చోరీ కేసులు చూసుకుని అరెస్టైనప్పుడల్లా జైలు నుంచి బయటకు తీసుకొస్తాడు కదాని ఓ లాయర్ని పురమాయించుకున్నాడు. కానీ చివరకు అదే లాయర్ అతగాడిని కటకటాల వెనకవేశాడు. ఈ వింత చోరీ శిఖామణి కేసు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే..నెల్లూరుకు చెందిన నిందితుడు.. తన చోరీ కేసులు వాదించేందుకు కావలిలో ఓ లాయర్‌ని సంప్రదించాడు. మొత్తం అన్ని వివరాలు పూసగుచ్చినట్లు చెప్పి, కేసు వాయిదాలకు తిరగసాగాడు. ఇటీవల ఓ కేసు వాయిదా విషయమై వచ్చిన నిందితుడు లాయరుతో మాట్లాడి.. ఆయనకు ఫీజు కూడా చెల్లించాడు. తిరిగి ఇంటికెళ్తూ.. జేబులు చూసుకుంటే నిల్. దీంతో చోరీ కేసులు వాదించేందుకు పురమాయించిన లాయిర్‌కే ఎసరు పెట్టాడు. తన లాయర్ బైక్‌నే సైలెంట్‌గా కొట్టేసి.. అక్కడి నుంచి చక్కాపోయాడు.ఆనక తన బైక్ మిస్సైన విషయం తెలుసుకున్న లాయర్.. కావలి టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. లాయర్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. బైక్ చోరీ చేసిన దొంగను అరెస్ట్ చేశారు. తన బైక్‌ను చోరీ చేసింది తన క్లైంటేనన్న సంగతి తెలుసుకున్న లాయర్ షాక్‌కు గురయ్యారు. ఈ కేసుపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని కావలి టూటౌన్ సీఐ గిరిబాబు మీడియాకు తెలిపారు.

# మ్యానిఫెస్టోకే దిక్కులేదు-విజన్ 2047 అంట..!



జగన్ పంచ్ లు..!

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. ఇవాళ అనంతపురం జిల్లాకు చెందిన వైసీపీ నేతలతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకున్న తాజా పరిస్థితులతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా జగన్ వారితో చర్చించారు. అలాగే తమ హయాంలో రాష్ట్రంలో చేపట్టిన సంస్కరణలను గుర్తు చేసిన జగన్.. వాటితో కూటమి సర్కార్ పాలనను పోల్చారు. అనంతపురం జిల్లా నేతలతో ఇవాళ సమావేశం అయిన వైఎస్ జగన్.. సాగునీటి సంఘాల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆరోపించారు. విజన్ 2047 పేరిట డ్రామా మొదలు పెట్టారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టోకే దిక్కులేదని జగన్ వ్యాఖ్యానించారు. విజన్ అంటే మా ప్రభుత్వంలో తెచ్చిన సంస్కరణలు అన్నారు. ఆరోగ్య రంగంలోనూ విప్లవాత్మక సంస్కరణలు తెచ్చామని గుర్తుచేశారు. %ూశ్రీంశీ =ఝఁ% "జగన్ కు చంద్రబాబు ఆసక్తి కర ట్వీట్- ట్రెండింగ్..!!" సచివాలయాల ద్వారా ప్రజల ఇంటి దగ్గరకే సేవలందించామని, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్ వ్యవస్థ తెచ్చామని, ప్రతి ఎకరా ఈ-క్రాప్ చేయించామని జగన్ తెలిపారు. రంగు రంగుల కథలకు విజన్ అని పేరు పెడుతున్నారన్నారు. దాన్ని విజన్ అనరు..420 అంటారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పెన్షన్లు కట్ చేశారని, కొత్తగా ఏ ఒక్కరికీ పెన్షన్లు ఇవ్వలేదని జగన్ ఆరోపించారు. ప్రభుత్వంపై పోరుకు జనం సిద్ధం కావాలన్నారు. అలాగే పార్టీ శ్రేణులకూ నాయకులుగా ఎదిగేందుకు ఇదో మంచి అవకాశమన్నారు.

# శాంతి భర్తకు సాయిరెడ్డి షాకింగ్ గిఫ్ట్ లోకేష్ ను కలిసి ఫిర్యాదు




ఏపీలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికీ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్న కళింగిరి శాంతి భర్త మదన్ మోహన్ కూ మధ్య వివాదం మరింత ముదిరింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తనను మోసపూరితంగా అమెరికా పంపి తన భార్య శాంతితో సాయిరెడ్డి అక్రమ సంబంధం పెట్టుకున్నారంటూ మదన్ ఆరోపించారు. దీనిపై స్పందించిన శాంతి తన మాజీ భర్త ఆరోపణలు నిజం కాదని ఖండించారు. అయినా ఆయన ఆరోపణల పర్వం కొనసాగుతోంది. అయితే తాజాగా మదన్ హైదరాబాద్ నుంచి కోల్ కతా బదిలీ అయ్యారు. విజయసాయిరెడ్డితో తన భార్య శాంతి అక్రమ సంబంధం, దీనిపై తాను చేస్తున్న పోరాటం నేపథ్యంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్ లో అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేస్తున్న తనను హైదరాబాద్ నుంచి కోల్ కతాకు బదిలీ చేయించారని ఆయన ఆరోపిస్తున్నారు. ఇదే ఆరోపణలతో మదన్ తాజాగా మంత్రి నారా లోకేష్ ను ప్రజాదర్బార్ కు వెళ్లి కలిశారు. ఎంపీ విజయసాయిరెడ్డి తన భార్యను లోబర్చుకొని విశాఖపట్నంలో రూ.1500 కోట్ల విలువైన భూములు కొల్లగొట్టారని, ఆయన అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలపై పోరాడుతున్నందుకు తనను ఇటీవల హైదరాబాద్ నుంచి కోల్ కతాకు బదిలీ చేయించారని సస్పెన్షన్ కు గురైన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కళింగిరి శాంతి భర్త మదన్ మోహన్ ఫిర్యాదు చేశారు. చంద్రబాబు మనవడు నారా దేవాన్ష్ వరల్డ్ రికార్డు-వేగంగా చెక్ మేట్ పెట్టి..!" విజయసాయి రెడ్డి, అడ్వకేట్ సుభాష్ కలసి తన భార్య కళింగిరి శాంతిని లోబర్చుకొని విశాఖలో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు పెద్దఎత్తున భూములు కొల్లగొట్టారని ఆరోపించారు. అలాగే తనను ఏమార్చి అమెరికా పంపిన విజయసాయి తన భార్య శాంతితో రహస్యంగా సహజీవనం చేసి మగబిడ్డను కన్నారన్నారు. తాను స్థానికంగా లేని సమయంలో బిడ్డకు విజయసాయిరెడ్డే తండ్రి అని గట్టిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాల్సిందిగా రాష్ట్రపతి, ప్రధాని కార్యాలయాలతో పాటు రాష్ట్ర హెూంమంత్రి డీజీపీలను కలిసి విన్నవించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు తనకు న్యాయం జరగలేదని, విజయసాయిరెడ్డికి డిఎన్ఏ పరీక్షలు నిర్వహించి శాంతికి కలిగిన బిడ్డకు తండ్రి ఎవరో తేల్చాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో శాంతి అసిస్టెంట్ కమిషనర్ గా పనిచేసిన కాలంలో రూ.20కోట్లకు పైగా అక్రమాస్తులు సంపాదించిందని,. కుంచనపల్లిలో రూ.4కోట్ల విలువైన విల్లా, జగన్ ఇంటి సమీపంలో రూ.3కోట్ల విలువైన ఇల్లు, విశాఖ సాగర్ నగర్లో ట్రిపుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ తోపాటు ఆమెకు విలాసవంతమైన కార్లు ఉన్నాయని మదన్ ఆరోపించారు. విశాఖలో విజయసాయి, సుభాష్, తన భార్య శాంతి కలిసి కొట్టేసిన రూ.1500 కోట్ల భూములపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు, విజయసాయి కుట్రతో కోల్ కతా బదిలీ అయిన తనను తిరిగి హైదరాబాద్ కు ట్రాన్స్ ఫర్ చేయించాలని మదన్ మోహన్ కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని మంత్రి లోకేష్ హామీ

# చిచ్చు కాదు.. కార్చిచ్చు..!

# యాక్షన్ థ్రిల్లర్ సెంటిమెంట్ సిన్మాని తలపిస్తోన్న పుష్ప ఎపిసోడ్..




పంచ్ డైలాగులు పేలుతున్నాయ్. యాక్షన్ థ్రిల్లర్ సెంటిమెంట్ సిన్మాని తలపిస్తోంది పుష్ప ఎపిసోడ్. క్లైమాక్స్ ఎలా ఉండబోతోందో ఎవరి ఊహకీ అందడంలేదు. హీరోలైతే మాత్రం.. బాధ్యతగా ఉండొద్దా అంటోంది ప్రభుత్వం. సెలబ్రిటీలు సిన్మాకు వెళ్లడమే నేరమా అంటోంది ఫిల్మ్ ఇండస్ట్రీ. ఇది ముమ్మాటికీ కక్షసాధింపేనంటున్నాయ్ విపక్షాలు. ఎవరివాదన వారిదే.. కానీ ప్రజల దృష్టిలో తప్పెవరిది?..ఒక్క ఐడియా జీవితాన్ని మారుస్తుందో లేదోగానీ.. ఒక్క దుర్ఘటన ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య పెద్ద అగాధాన్నే సృష్టించింది. ఆడియో ఫంక్షన్లు, ప్రీ రిలీజ్ ఈవెంట్లను పండుగలా నిర్వహించే సినీ పరిశ్రమలో కార్చిచ్చులా రాజుకుంటోంది పుష్ప వివాదం. నాటోన్లీ టాలీవుడ్.. బాలీవుడ్ దాకా ఇప్పుడు అల్లు అర్జున్‌పై కేసు గురించే చర్చ. అరెస్టయ్యారు, రిమాండ్ అయ్యారు. బెయిలొచ్చినా ఓ రాత్రంతా జైల్లో ఉన్నారు. మ్యాటర్ ఇంతటితో క్లోజ్ అవుతుందనుకుంటే ఇప్పట్లో మంటలు చల్లారేలా కనిపించడంలేదు. చిక్కడపల్లి సంధ్య థియేటర్. పుష్ప టూ ప్రీమియర్ షోకు ఫ్యామిలీతో వచ్చారు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. ఇసుకేస్తే రాలనంత జనసందోహం. హీరోని చూసేందుకు పోటెత్తారు అభిమానులు. కానీ అభిమానం ఓ నిండు ప్రాణం తీస్తుందని, మరొకరిని ప్రాణాపాయస్థితిలోకి నెట్టేస్తుందని ఊహించలేదెవరూ. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోయింది. తొమ్మిదేళ్ల ఆమె కుమారుడు శ్రీతేజ్ మూడువారాలుగా ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య చికిత్సపొందుతున్నాడు. తొక్కిసలాట ఘటనలో ఏ11గా అల్లు అర్జున్‌పై కేసు నమోదైంది. నాంపల్లి కోర్టు రెండువారాల రిమాండ్ విధించినా.. హైకోర్టు బెయిల్ మంజూరుచేయడంతో రిలీజయ్యారు అల్లు అర్జున్. కానీ ఫార్మాలిటీస్ ఆలస్యం కావటంతో ఓ రాత్రంతా ఆయన చంచలగూడ జైల్లోనే గడపాల్సి వచ్చింది.అల్లు అర్జున్ అరెస్ట్‌పై సెలబ్రిటీలంతా స్పందించారు. జైలునుంచి ఇంటికి చేరగానే అల్లు ఇంటికి టాలీవుడ్ ప్రముఖులు క్యూ కట్టారు. బాలీవుడ్ తారలు కూడా అల్లు అర్జున్ అరెస్ట్‌ని తప్పుబట్టారు. బీఆర్ఎస్, బీజేపీ అల్లు అర్జున్ అరెస్ట్‌ని తప్పుపట్టాయి. నేషనల్ అవార్డ్ విన్నర్‌ని ఓ క్రిమినల్‌లా అరెస్ట్ చేశారని విమర్శించాయి. మహిళ మృతిపై విచారం వ్యక్తంచేస్తూనే ఆ తొక్కిసలాటకు తాను కారణం కాదన్నారు అల్లు అర్జున్. మృతురాలి కుటుంబానికి 25లక్షల పరిహారం ప్రకటించారు. అల్లు అర్జున్‌ని సినీ ఇండస్ట్రీతో పాటు విపక్షాల సంఘీభావంతో.. అసెంబ్లీలో తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం ప్రకటన చేసింది. అల్లు అర్జున్‌పై అసెంబ్లీలో తీవ్రస్థాయిలో స్పందించారు సీఎం రేవంత్‌రెడ్డి.అల్లు అర్జున్ అరెస్ట్ తొందరపాటు చర్యని బీజేపీ, బీఆర్ఎస్ తప్పుపడితే.. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ చర్యని సమర్థించింది మజ్లిస్‌పార్టీ. చట్టానికి ఎవరూ అతీతులు కారని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ప్రభుత్వాన్ని వెనకేసుకొచ్చారు. తొక్కిసలాట ఘటన చివరికి సిన్మా ఇండస్ట్రీపై చర్చగా మారిపోయింది. సినీ ఇండస్ట్రీకి మినహాయింపు విషయంలో ఇక కచ్చితంగా వ్యవహరించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో చిత్రపరిశ్రమ ఉలిక్కిపడింది. అల్లు అర్జున్‌కి సినీ ప్రముఖులంతా మద్దతు పలకటంతో సర్కారు కూడా తొక్కిసలాట ఘటనని సీరియస్‌గా తీసుకుంది.ఓరాత్రంతా జైల్లో గడిపివచ్చాక ఆచితూచి స్పందించారు అల్లు అర్జున్. జరిగిన ఘటన దురదృష్టకరమని, తాను చట్టాన్ని గౌరవిస్తానని చెప్పుకొచ్చారు. అయితే ఎప్పుడైతే తనపై అసెంబ్లీలో చర్చ జరిగిందో మరోసారి మీడియాముందుకొచ్చారు పుష్పరాజ్. తన క్యారెక్టర్‌ని డ్యామేజ్ చేసే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. తానెలాంటి రోడ్‌షోలు చేయలేదని, తొక్కిసలాట జరిగినట్లు కూడా తన దృష్టికి రాలేదని చెప్పుకొచ్చారు.అల్లు అర్జున్ వివరణ తమను నిందించేలా ఉండటంతో పోలీసులు యాక్షన్‌లోకి దిగారు. అనుమతి లేకున్నా అల్లు అర్జున్ థియేటర్‌కొచ్చి తొక్కిసలాటకు కారణమయ్యారని సీసీ ఫుటేజ్, ఇతర వీడియోలను బయటపెట్టారు. అల్లు అర్జున్ టీంతో పాటు థియేటర్ సిబ్బంది సహకరించలేదని కేసులో కొత్త ట్విస్టులు తెరపైకొచ్చాయి. డిసెంబర్? 4న సంధ్య థియేటర్‌కి అల్లు అర్జున్? వచ్చినప్పుడు బయట, లోపల ఏం జరిగిందో మినిట్? టు మినిట్?.. పిన్? టు పిన్? వీడియో ఎవిడెన్స్ రిలీజ్ చేశారు పోలీసులు. రాత్రి 9.15 నుంచి అర్ధరాత్రి 12గంటల 5 నిమిషాలదాకా అక్కడేం జరిగిందో.. రీల్ టూ రీల్ పుష్ప త్రీ చూపించారు.థియేటర్ దగ్గర తొక్కిసలాట ఘటన అల్లు అర్జున్‌కే పరిమితంకాలేదు. ఇప్పుడు ఇండస్ట్రీ అంతా చుట్టుకుంది. ఆయన అరెస్ట్ తప్పన్నవారు కూడా ఇలా జరిగుండాల్సి కాదని భావిస్తున్నారు. ప్రభుత్వంతో ఘర్షణ వైఖరితో పరిశ్రమ నష్టపోతుందనే అభిప్రాయంతో ఉన్నారు. ఇండస్ట్రీకి ఎప్పుడూ ఇలాంటి సంక్లిష్ట పరిస్థితి ఎదురుకాలేదు. ఏ వివాదమైనా పరిశ్రమ మొత్తానికి వర్తించేలా ఉండేది. కానీ ఇప్పుడు ఓ హీరోపై మొదలైన వివాదం ఇండస్ట్రీకి చుట్టుకుంటోంది. సెలబ్రిటీలు చట్టానికి అతీతులు కారంటోంది ప్రభుత్వం. హీరోలకన్నా తమకు సామాన్యుల ప్రాణాలే ముఖ్యమంటోంది.తొక్కిసలాటలో మహిళ మృతికి హీరో కారణమైతే.. ఆ లెక్కన ప్రభుత్వ పెద్దలపై కూడా కేసులు పెట్టాలంటోంది బీఆర్ఎస్. ప్రభుత్వ విధానాలతో ఆత్మహత్యలు చేసుకున్న వారి చావులకు సర్కారే బాధ్యత వహించాలంటోంది. ఇక బీజేపీ నాయకత్వమైతే అల్లు అర్జున్ అరెస్ట్‌ని జాతీయస్థాయిలో వ్యతిరేకిస్తోంది. సెలబ్రిటీలే ముఖ్యమా.. సామాన్యుల ప్రాణాలకు విలువలేదా అన్న చర్చతో మ్యాటర్ మరో టర్న్ తీసుకుంటోంది. జస్టిస్ ఫర్ రేవతి అనే స్లోగన్ సౌండ్ పెరుగుతోంది. ప్రజల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాల్లో కామన్‌మేన్ వర్సెస్ సెలబ్రిటీస్ వాదనని తెరపైకి తెచ్చారు ప్రభుత్వ పెద్దలు. దీంతో బీఆర్ఎస్ ఈ విషయంలో కాస్త స్వరం తగ్గించినా.. బీజేపీ మాత్రం తగ్గేదేలేదంటోంది.సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు పోలీసుల వైఫల్యమే కారణమని నిందిస్తోంది తెలంగాణ బీజేపీ. ఇద్దరు కేంద్రమంత్రులూ అల్లు అర్జున్ అరెస్ట్‌ని తీవ్రంగా తప్పుబడుతుంటే.. ఏపీలో ఆ పార్టీ నాయకత్వం భిన్నంగా స్పందిస్తోంది. మిగతావారిని అరెస్ట్ చేయకుండా ఒక్క హీరోనే అరెస్ట్ చేస్తే అది తప్పేనన్నారు ఏపీబీజేపీ చీఫ్ పురంధేశ్వరి. ఆ పార్టీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాత్రం అసెంబ్లీలో తెలంగాణ సీఎం చేసిన వ్యాఖ్యలతో ఏకీభవించారు.తొక్కిసలాట ఘటనలో హీరో ప్రమేయం దగ్గరే ఆగడం లేదు చర్చ. అసలా సిన్మా కంటెంట్ ఏంటన్నదానిపైనా మొదలైంది రచ్చ. అడ్డదారులు తొక్కే స్మగ్లర్‌ని కథానాయకుడిగా చూపించే సిన్మాకి జాతీయ అవార్డు ఇవ్వడం దేనికి సంకేతమంటున్నారు ప్రభుత్వ పెద్దలు. నైజాంలో సిన్మాలు ఆడకపోతే ఇండస్ట్రీకి బతుకే లేదని తీవ్రస్థాయిలో స్పందించారు. కోట్లకు పడగలెత్తే సిన్మా హీరోలు ఏనాడైనా ఏ ఊరినైనా దత్తత తీసుకున్నారా అన్న ప్రశ్న వస్తోంది అధికారపార్టీ నుంచి.మొదట పుష్ప వర్సెస్ రేవంత్. నిన్నేమో సెలబ్రిటీ వర్సెస్ కామన్‌మేన్. ఇప్పుడు సినీపరిశ్రమ వర్సెస్ ప్రజాప్రభుత్వంగా మారిపోయింది వివాదం. సెలబ్రిటీల స్టేటస్సే ముఖ్యమా.. సామాన్యుల ప్రాణాలకు విలువలేదా అన్న ప్రశ్నతో అసలీ ఘటనలో తప్పెవరిదన్న చర్చ గ్రౌండ్‌లెవల్‌కి వెళ్లిపోయింది. విషయం సున్నితంగా మారటంతో ఇంటిపై కొందరు దాడికి ప్రయత్నించినా.. అంత సీరియస్‌గా రియాక్ట్ కాలేదు అల్లు ఫ్యామిలీ. తొక్కిసలాట ఘటనని నిరసిస్తూ విద్యార్థిసంఘాలు దాడికి దిగినా.. అంతా సంయమనం పాటించాలని అప్పీల్ చేశారు అల్లు అరవింద్.ఎంత లేదన్నా.. ఎవరు కాదన్నా సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన రాజకీయరంగు పులుముకుంటోంది. దీంతో సమస్య మరింత జటిలం కాకుండా చూసేందుకు టాలీవుడ్ ప్రముఖులు ప్రయత్నిస్తున్నారు. అటు ప్రభుత్వం కూడా పరిశ్రమకు తాము వ్యతిరేకం కాదనే సంకేతాలిస్తోంది. కార్చిచ్చుని చల్లార్చే ప్రయత్నాలైతే మొదలయ్యాయి.రాజకీయం చేస్తున్నదెవరు? వివాదం చల్లారకుండా చూస్తున్నదెవరు? పుష్ప తగ్గుండాల్సిందని ప్రభుత్వం భావిస్తోందా? సర్కారు కన్నెర్రతో ఇండస్ట్రీ కలవరపడుతోందా? ఇండస్ట్రీ ఏం చేయబోతోంది? పుష్పరాజ్ కేసు ఏ మలుపు తిరగబోతోంది?చట్టం తన పని తాను చేసుకుపోతుంది. రొటీన్ డైలాగే అయినా అది హండ్రెడ్ పర్సెంట్ వాస్తవం. తొక్కిసలాట ఘటనలో ఏ11గా ఉన్న అల్లు అర్జున్ విషయంలో చట్టం తుదినిర్ణయం ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేం. కానీ ఈ ఎపిసోడ్ సినీ పరిశ్రమలో తుఫాన్ సృష్టించింది. ఇక బెనిఫిట్ షోలకు, టికెట్ల రేట్లు పెంచేందుకు అనుమతించకూడదని తెలంగాణ సర్కారు సీరియస్ డెసిషన్ తీసుకునేదాకా వచ్చింది. ఏపీపైనా ఇది ప్రభావం చూపేలా ఉంది.లాభాలొస్తే జనానికేమన్నా ఇస్తారా. టికెట్ల రేట్లు అడ్డగోలుగా పెంచుకునేందుకు పర్మిషన్ ఎందుకివ్వాలనే చర్చ జరుగుతోంది. అల్లు అర్జున్ వ్యవహారంలో సీఎం స్పందనతో.. ప్రభుత్వంతో సుహృద్భావ వాతావరణంలో చర్చ జరగాలని కోరుకుంటున్నారు పరిశ్రమ పెద్దలు. బెనిఫిట్ షోలు, టికెట్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని స్వాగతించింది తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్.పెద్ద బ్యానర్లు, బడా హీరోల సిన్మాలపై ఇండస్ట్రీలో మొదట్నించీ భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. చిన్న సిన్మాలకు కూడా స్క్రీన్స్ దొరకాలనే వాదన మొదట్నించీ ఉంది. అల్లు అర్జున్ కేసుతో అవన్నీ మళ్లీ చర్చకొస్తున్నాయి. తెలంగాణలో పరిణామాలతో టాలీవుడ్ ఇండస్ట్రీ ఏపీకి షిఫ్ట్ అవుతుందనే చర్చ.. వివాదానికి ఇంకాస్త ఆజ్యంపోస్తోంది. పవన్‌కల్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎంగా ఉండటంతో రాష్ట్రానికి సినీ పరిశ్రమని స్వాగతిస్తున్నారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం కూడా ఆచితూచి వ్యవహరిస్తోంది.తాను సీఎంగా ఉండగా ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతించేది లేదని, టికెట్ల రేట్లు పెంచడానికి వీల్లేదని చెప్పేశారు సీఎం రేవంత్‌రెడ్డి. దీంతో సంక్రాంతికి రిలీజ్ కానున్న తెలుగు సినిమాల నిర్మాతల్లో కొత్త టెన్షన్? స్టార్ట్ అయింది. పండగ సీజన్‌లో కలెక్షన్లపై ఆశలు పెట్టుకున్న ప్రొడ్యూసర్లు డైలమాలో పడ్డారు. తెలంగాణలో కుదరకపోయినా ఏపీలోనైనా కవర్ చేసుకుందామంటే ఆ పప్పులు ఉడకవన్నట్లే స్పందిస్తున్నారు అక్కడి అధికారపార్టీ నేతలు.రాజకీయం తలదూర్చింది. సమాజానికి ఈ సిన్మా ఏమిచ్చిందని ప్రశ్నించేదాకా వచ్చింది. ఇండస్ట్రీకి కూడా ఇది పరీక్షాసమయంలా ఉంది. ఎవరిమీదా తమకు వ్యక్తిగతంగా కోపం ఉండదంటోంది ప్రభుత్వం. సామాన్య ప్రజల భద్రత, సంక్షేమమే తమకు తొలి ప్రాధాన్యమని చెబుతోంది. మరోవైపు జరిగిన సంఘటనపై ఆవేదన వ్యక్తంచేస్తున్న అల్లు అర్జున్.. ఈ కేసునుంచి ఎలా బయటపడతారన్న చర్చ జోరందుకుంది. రేవతి మృతి కేసులో ఆయనకు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ఇచ్చింది తెలంగాణ హైకోర్ట్. బన్నీ బెయిల్‌ని రద్దు కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయబోతున్నారు హైదరాబాద్ పోలీసులు. హైకోర్ట్ కండీషన్లను పట్టించుకోకుండా అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెట్టారని.. ఇది బెయిల్ నిబంధనలకు విరుద్ధమన్నది పోలీసుల వాదనగా కనిపిస్తోంది.ఇంత కష్టపడి నిర్మించుకున్న ఇమేజ్ ఒక్క ఘటనతో డ్యామేజ్ అవుతోందన్న బాధ అల్లు కుటుంబానిది. సినీపరిశ్రమ ముఖ్యమే. కానీ ప్రజలు అంతకంటే ముఖ్యమన్నది ప్రభుత్వ వాదన. అనుకోకుండా ఓ ఘటన జరిగిపోయింది. ఈ వివాదం ఇంతటితో సమసిపోతే బాగుంటుందని కోరుకుంటోంది ఫిల్మ్ ఇండస్ట్రీ. బాధిత కుటుంబానికి 50లక్షల చెక్కుని అందించారు పుష్పటూ నిర్మాతలు. ఆ కుటుంబానికి జీవితకాలం భరోసా ఉండే ఏర్పాటు చేస్తామంటోంది అల్లు ఫ్యామిలీ. తప్పెవరిదని నిందిస్తూ కూర్చునేకంటే.. ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పడితేనే బాగుంటుందని ఫీలవుతున్నాడు కామన్‌మ్యాన్ కూడా.

# అదరగొట్టిన నితీష్ కుమార్ రెడ్డి.. పుష్ప స్టైల్లో సంబరాలు




బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25 నాలుగో టెస్ట్ మ్యాచ్ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతోంది. ఇప్పటి వరకు నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్, ఆస్ట్రేలియా జట్లు ఐదు హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ నమోదు చేశాయి. ఇందులో ఆస్ట్రేలియన్ యువ ఆటగాడు సామ్ కాన్‌స్టాన్స్ హాఫ్ సెంచరీతో హెడ్‌లైన్స్‌లో నిలిచాడు. ఇదే సమయంలో తాజాగా భారత యువ ఆటగాడు నితీష్ కుమార్ రెడ్డి సెంచరీ చేయడం చర్చనీయాంశంగా మారింది. నితీష్ కుమార్‌కి ఇదే తొలి టెస్టు సెంచరీ కాగా, అభిమానులు సోషల్ మీడియా వేదికగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. సూపర్, గ్రేట్ అని మెచ్చుకుంటూ కామెంట్లు చేస్తున్నారు.

### పుష్ప సినిమా స్టైల్‌లో

ఆస్ట్రేలియాపై నితీష్ కుమార్ రెడ్డి తన టెస్టు కెరీర్‌లో తొలి అర్ధ సెంచరీని నమోదు చేసి, తాజాగా సెంచరీ కూడా పూర్తి చేశాడు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న తన టెస్ట్ కెరీర్‌లో మూడో మ్యాచ్‌లో ఆరో ఇన్నింగ్స్‌లో ఆయన ఈ అర్ధ సెంచరీని సాధించాడు. నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో నితీశ్ కుమార్ 82.3 ఓవర్లలో అర్ధసెంచరీ సాధించాడు. మిచెల్ స్టార్క్ వేసిన బంతిని నితీష్ కుమార్ రెడ్డి ఎదుర్కొన్నాడు. మిచెల్ వైడ్ డెలివరీలో నితీష్ బంతిని ఆఫ్ సైడ్‌లోకి ముందుకు పంపించాడు. ఆ క్రమంలో నితీష్ మొదటి టెస్ట్ హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. ఈ అద్భుతమైన షాట్ తర్వాత నితీష్ టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ పుష్ప సినిమా స్టైల్‌లో తన క్రికెట్ బ్యాట్‌ను తగ్గేదేలే అంటూ ఒక స్టిల్ ఇచ్చాడు. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఆస్ట్రేలియాభారత్ నాలుగో

# టెస్టులో భారత్‌కు మళ్లీ దెబ్బ..

మెల్‌బోర్న్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య బాక్సింగ్ డే టెస్టు కొనసాగుతోంది. ఇరు జట్ల మధ్య ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇది నాలుగో టెస్టు. ఈ క్రమంలో శుక్రవారం రెండో రోజు మ్యాచ్ కొనసాగుతుండగా, ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉంది.

### ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 474 పరుగుల వద్ద ముగిసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టులో తొలి ముగ్గురు బ్యాట్స్‌మెన్ హాఫ్ సెంచరీలు సాధించారు. దీని తర్వాత స్టీవ్ స్మిత్ తన టెస్టు కెరీర్‌లో 34వ సెంచరీని నమోదు చేశాడు. కెప్టెన్ పాట్ కమిన్స్ 49 పరుగులతో ఇన్నింగ్స్ ఆడాడు. రెండో రోజు ఆస్ట్రేలియా ఆరు వికెట్లకు 311 పరుగుల వద్ద ఆట ప్రారంభించింది. ఈరోజు నాలుగు వికెట్ల కోసం భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈరోజు ఆస్ట్రేలియా 163 పరుగులు చేసి, నాలుగు వికెట్లు కోల్పోయింది. 140 పరుగుల వద్ద స్మిత్ ఔటయ్యాడు. భారత్ తరఫున జస్ప్రీత్ బుమ్రా అత్యధికంగా నాలుగు వికెట్లు పడగొట్టాడు. కాగా, రవీంద్ర జడేజాకు మూడు వికెట్లు దక్కాయి. ఆకాశ్‌దీప్‌కి రెండు వికెట్లు లభించగా, సుందర్‌కు ఒక వికెట్ దక్కింది.

### టీమిండియాకు మొదటి దెబ్బ

ఈ క్రమంలోనే మళ్లీ ఆటకు దిగిన భారత్ ఆటగాళ్లకు ఎనిమిది పరుగుల స్కోరులో తొలి దెబ్బ తగిలింది. ఓపెనర్‌గా రోహిత్ శర్మ విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌కు యశస్వితో కలిసి ఓపెనింగ్ చేశాడు. రెండో ఓవర్‌లో పాట్ కమిన్స్ వేసిన బంతికి బోలాండ్ క్యాచ్ ఔట్ అయ్యాడు. రోహిత్ మూడు పరుగులు మాత్రమే చేశాడు. రోహిత్ ఓపెనింగ్ కారణంగా శుభ్‌మన్ గిల్‌ను జట్టు నుంచి తప్పించారు. అయితే హిట్‌మ్యాన్ ఇప్పుడు ఫ్లాప్ అని మరోసారి రుజువైంది. ఈ క్రమంలోనే మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన రాహుల్ 24 పరుగులు చేసి ఔటయ్యాడు. దీంతో ప్రస్తుతం క్రీజులో యశస్వి ఉండగా, టీమిండియా స్కోర్ రెండు వికెట్ల నష్టానికి 51 పరుగులు.

### గొడవ జరిగిందా...

తొలిరోజు మైదానంలో విరాట్ కోహ్లి, సామ్ కాన్‌స్టాస్ మధ్య గొడవ జరిగింది. కానీ కాన్స్టాస్ పెద్దగా పట్టించుకోలేదని, ఆస్ట్రేలియన్ ఇన్నింగ్స్ పదో ఓవర్ తర్వాత ఆటగాళ్లు ఎదురుగా వెళుతుండగా కోహ్లి, కాన్స్టాస్ భుజాలు ఢీకొన్నాయని చెప్పాడు. ఆట ముగిసిన అనంతరం కాన్స్టాస్ మాట్లాడుతూ.. కోహ్లి తనను ఉద్దేశ్యపూర్వకంగా ఢీకొట్టలేదని చెప్పాడు. విరాట్ కోహ్లి అనుకోకుండా నన్ను ఢీకొట్టాడని వెల్లడించారు. క్రికెట్‌లో ఇదంతా సాధారణంగా జరుగుతూనే ఉంటుందన్నారు.

### టిక్కెట్ల సేల్..

బాక్సింగ్ డే టెస్ట్‌లో మొదటి రోజు రికార్డు స్థాయిలో 87242 మంది ప్రేక్షకులు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. రెండు జట్ల మధ్య టెస్టు క్రికెట్‌లో వన్డే హాజరు కావడం కొత్త రికార్డు. నాలుగో టెస్టు తొలిరోజు టిక్కెట్లు మ్యాచ్‌కి రెండు వారాల ముందే అమ్ముడుపోయాయి

# ఆఖర్లో..ఆ రనౌట్‌తో! అంతా తారుమారు

**భారత్ తొలి ఇన్నింగ్స్ 164/5**

**జైస్వాల్ అర్ధసెంచరీ**

**ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 474**

**స్టీవ్ స్మిత్ శతకం**

మెల్‌బోర్న్: అంతా బాగుందనుకున్న వేళ.. బ్యాటర్ల అనూహ్య తడబాటు భారత్‌ను కష్టాల్లోకి నెట్టింది. ఓవైపు యశస్వీ జైస్వాల్ (82) సెంచరీ ఖాయమనిపించేలా క్రీజులో కుదురుకున్నాడు. మరోవైపు తన బలహీనతను అధిగమిస్తూ దీటుగా నిలబడిన విరాట్ కోహ్లి (36). వీరిద్దరి ఆటతో బాక్సింగ్ డే టెస్టు రెండో రోజు టీమిండియా ఓ దశలో 153/2తో పటిష్ఠంగా కనిపించింది. కానీ జైస్వాల్ రనౌట్ అంతా మార్చివేసింది. ఒక్కసారిగా ఆసీస్ పోటీలోకి రావడంతో 6 పరుగుల తేడాతో భారత్ మూడు వికెట్లు కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుతం టీమిండియా శుక్రవారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 164/5 స్కోరు చేసింది. ఇప్పటికే సగం జట్టు పెవిలియన్‌కు చేరగా, భారత్ ఫాలోఆన్ గండం దాటాలంటే మరో 111 పరుగులు చేయాల్సి ఉంది. ఇక భారమంతా క్రీజులో ఉన్న పంత్ (6 బ్యాటింగ్), జడేజా (4)పైనే ఉంది. ఆ తర్వాత నితీశ్, సుందర్ కూడా బ్యాటర్లే కావడం సానుకూలాంశం. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 474 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (140) వరుసగా రెండో శతకం సాధించగా, కమిన్స్ (49) సహకరించాడు. బుమ్రాకు నాలుగు, జడేజాకు మూడు, ఆకాశ్‌కు రెండు వికెట్లు దక్కాయి. స్మిత్ శతకం: 311/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆసీస్‌కు స్మిత్, కెప్టెన్ కమిన్స్ భారీ స్కోరుకు దోహదపడ్డారు. భారత బౌలర్లు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోవడంతో ఇద్దరూ వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలతో స్కోరును పెంచారు. ఈ జోరుతో స్మిత్ కెరీర్‌లో 34వ శతకం పూర్తి చేశాడు. అనంతరం తను మరింత దూకుడుతో ఆడడంతో స్కోరు 400 దాటింది. అయితే ఏడో వికెట్‌కు 112 పరుగులు జోడించాక జడ్డూ ఓవర్‌లో కమిన్స్ వెనుదిరిగాడు. తొలి సెషన్‌లో ఆసీస్ 143 పరుగులు సాధించడం విశేషం. ఆ తర్వాత బ్రేక్ ముగిసిన తొలి రెండు ఓవర్లలోనే ఆసీస్ స్టార్క్ (15), స్మిత్ వికెట్లను కోల్పోయింది. కాసేపటికే చివరి వికెట్ లియోన్ (13)ను బుమ్రా అవుట్ చేయడంతో దాదాపు మూడున్నర గంటల ఆసీస్ పోరాటం ముగిసింది. ఓపెనర్‌గా వచ్చినా.. : జైస్వాల్‌కు జతగా రోహిత్ (3) ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. కానీ అతడు ఈ టెస్టులోనూ నిరాశపర్చాడు. రెండో ఓవర్‌లోనే అతడిని కమిన్స్ వెనక్కి పంపాడు. వన్‌డౌన్‌లో వచ్చిన రాహుల్ (24) తిరిగి జైస్వాల్‌కు జత కలిశాడు. ఇద్దరూ ఆచితూచి ఆడారు. మూడు ఫోర్లతో చక్కగా కుదురుకున్న రాహుల్ టీబ్రేక్‌కు ముందు ఓవర్‌లో కమిన్స్‌కు చిక్కాడు. ఈ సెషన్‌లో 15 ఓవర్లు ఆడిన భారత్ 51/2తో నిలిచింది. జైస్వాల్-విరాట్ అండగా.. : ఆఖరి సెషన్‌లో అధిక భాగం భారత్ ఆధిపత్యం చూపింది. జైస్వాల్-విరాట్ జోడీ ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ భారత్‌కు ఆశలు కల్పించారు. అలాగే ఆఫ్‌సైడ్ బంతులను వదిలేస్తూ విరాట్ ఈసారి సరైనరీతిలో ఆడాడు. అటు జైస్వాల్ సహజశైలిలో ఆడేస్తూ బౌండరీలు రాబట్టాడు. ఈ జోడీని విడదీసేందుకు కమిన్స్ బౌలర్లను మార్చినా, ఫీల్డింగ్‌ను మోహరించినా ఫలితం లేకపోయింది.



### ఆఖరి 20 నిమిషాల్లో..



జైస్వాల్-విరాట్ మధ్య మూడో వికెట్‌కు అప్పటికే వంద పరుగులు జత చేరాయి. ఇక ఆట ముగిసేందుకు 20 నిమిషాలే ఉంది. స్కోరు 153/2. వీరి ఆటనుచూస్తే మరో వికెట్ కోల్పోకుండా రోజును ముగిస్తారనిపించింది. కానీ ఇద్దరిమధ్య సమన్వయలోపంతో భారీమూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. 41వ ఓవర్ చివరిబంతికి జైస్వాల్ సింగిల్‌ను ఆశించాడు. ఈ క్రమంలో మిడాన్ వైపు బంతిని ఆడి వేగంగా నాన్‌స్ట్రయిక్ ఎండ్‌వైపు వచ్చాడు. అటు విరాట్ ఇదేమీ గమనించకుండా బంతిని చూస్తూ అక్కడే ఉండిపోయాడు. దీంతో ఇద్దరూ ఒకే వైపునకు చేరడంతో కీపర్ క్యారీ స్ట్రయిక్ ఎండ్ వికెట్లను గిరాటేయడంతో యశస్వీ రనౌటయ్యాడు. దీంతో మూ డో వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఏకాగ్రత కోల్పోయిన విరాట్ ఓవర్ వ్యవధిలో మళ్లీ ఆఫ్‌సైడ్ ఆవలి బంతిని ఆడి క్యారీకి క్యాచ్ ఇచ్చాడు. కాసేపటికే నైట్ వాచ్‌మన్ ఆకాశ్ డకౌట్ కావడంతో భారత్ తీవ్ర ఒత్తిడిలో రోజును ముగించింది.

### కోహ్లిని గేలి చేసిన ఆసీస్ ఫ్యాన్స్

ఈ సిరీస్‌లో కోహ్లికి కలిసి రావడంలేదు. ఆసీస్ అరంగేట్రం ఆటగాడు కాన్‌స్టాసను ఢీకొని విమర్శలపాలైన కోహ్లిని రెండోరోజు ఆటలో ఆసీస్ ఫ్యాన్స్ ఎగతాళి చేశారు. దీంతో అప్పటికే పెవిలియన్‌కు వెళ్తున్న కోహ్లి (36 పరుగులు) వెనక్కివచ్చి మరీ తనను గేలిచేసిన వారున్న స్టాండ్‌వైపు ఆగ్రహంగా చూశాడు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది విరాట్‌ను లోపలికి పంపించారు.

### గ్రౌండ్‌లోకి ఆగంతకుడు

రెండోరోజు ఆటలో ఓ ఆగంతకుడు మైదానంలోకి రావడం కలకలం రేపింది. భద్రతా సిబ్బంది కళ్లుగప్పి అతడు ముందుగా రోహిత్ వైపు వెళ్లగా అతడు వెంటనే పక్కకు తప్పుకొన్నాడు. దీంతో విరాట్‌ను సమీపించి భుజంపై చేయి వేసి ప్రేక్షకుల వైపు అభివాదం చేస్తూ కనిపించాడు. ఈ సమయంలో విరాట్ ప్రశాంతంగానే ఉండి అతడిని సెక్యూరిటీకి అప్పగించాడు.

### నమ్మకం లేనప్పుడు ఇద్దరు స్పిన్నర్లు ఎందుకు?

రెండో స్పిన్నర్‌గా వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవడాన్ని మాజీ కోచ్ రవిశాస్త్రి ప్రశ్నించాడు. ఆసీస్ ఇన్నింగ్స్ 52వ ఓవర్ వరకు అతడి చేతికి కెప్టెన్ రోహిత్ బంతి ఇవ్వనేలేదు. అప్పటికే జట్టు స్కోరు 171/2గా ఉంది. ఓవరాల్‌గా అతడు వేసింది 15 ఓవర్లే. శుక్రవారం లంచ్ విరామ సమయంలో శాస్త్రి మాట్లాడుతూ 'భారత్‌కు ప్రణాళిక లేకుండా పోయింది. అనుకున్నరీతిలో స్పిన్నర్లను ఉపయోగించుకోవడం లేదు. సుందర్‌ను అంత ఆలస్యంగా దించేట్టయితే ఇక ఇద్దరు స్పిన్నర్లతో ఆడడమెందుకు? స్పిన్నర్లపై నమ్మకం లేనప్పుడు ఇద్దర్ని తీసుకోవడం అవసరమా?' అని ఘాటుగా ప్రశ్నించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : కాన్‌స్టాస్(ఎల్బీ) జడేజా 60బీ ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 57బీ లబుషేన్ (సి) కోహ్లి (బి) సుందర్ 72బీ స్మిత్ (బి) ఆకాశ్ 140బీ హెడ్ (బి) బుమ్రా 0బీ మార్ష్ (సి) పంత్ (బి) బుమ్రా 4బీ క్యారీ (సి) పంత్ (బి) ఆకాశ్ 31బీ కమిన్స్ (సి) నితీశ్ (బి) జడేజా 49బీ స్టార్క్ (బి) జడేజా 15బీ లియోన్ (ఎల్బీ) బుమ్రా 13బీ బోలాండ్ (నాటౌట్) 6బీ ఎక్స్‌ట్రాలు: 27బీ మొత్తం: 122.4 ఓవర్లలో 474 ఆలౌట్‌బీ వికెట్ల పతనం: 1-89, 2-154, 3-237, 4-240, 5-246, 6-299, 7-411, 8-455, 9-455, 10-474.బౌలింగ్: బుమ్రా 28.4-9-99-4బీ సిరాజ్ 23-3-122-0బీ ఆకాశ్ 26-8-94-2బీ జడేజా 23-4-78-3బీ నితీశ్ 7-0-21-0బీ సుందర్ 15-2-49-1. భారత్ తొలి ఇన్నింగ్స్ : జైస్వాల్ (రనౌట్) 82బీ రోహిత్ (సి) బోలాండ్ (బి) కమిన్స్ 3బీ రాహుల్ (బి) కమిన్స్ 24బీ విరాట్ (సి) క్యారీ (బి) బోలాండ్ 36బీ ఆకాశ్ (సి) లియోన్ (బి) బోలాండ్ 0బీ పంత్ (బ్యాటింగ్) 6బీ జడేజా (బ్యాటింగ్) 4బీ ఎక్స్‌ట్రాలు: 9బీ మొత్తం: 46 ఓవర్లలో 164/5. వికెట్ల పతనం: 1-8, 2-51, 3-153, 4-154, 5-159బీ బౌలింగ్: స్టార్క్ 13-0-48-0బీ కమిన్స్ 13-2-57-2బీ బోలాండ్ 12-3-24-2బీ లియోన్ 5-1-18-0బీ మార్ష్ 3-0-15-0.



# మెల్‌బోర్న్‌సెంచరీ వీరుడు

# నితీష్‌రెడ్డికి ఏసీఏ భారీ నజరానా

అమరావతి : మెల్‌బోర్న్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బాక్సింగ్ డే టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్‌లో శనివారం మూడో రోజు సెంచరీ చేసిన విశాఖ కుర్రాడు నితీష్‌రెడ్డిని ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్(ఏసీఏ) అభినందిస్తూ నజరానా ప్రకటించింది. ఏసీఏ తరుపున రూ.25 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తామని ఏసీఏ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రకటించారు.త్వరలోనే సీఎం చేతుల మీదుగా నగదు బహుమతిని అందిస్తామని వెల్లడించారు. దేశంలోనే అత్యాధునిక వసతులతో అమరావతిలో స్టేడియాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడేలా విశాఖ స్టేడియం సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు . ఏపీకి కూడా ఐపీఎల్ టీమ్ ఉండేలా ఏసీఏ ఆలోచన చేస్తోందని అన్నారు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కష్టాల్లో ఉన్న జట్టును నితీష్‌రెడ్డిఆదుకున్నాడు. సీనియర్లంతా నిరాశపర్చినా ఆసీస్ బౌలర్లను ఆడుకున్నాడు. ఒక సిక్స్, 9 ఫోర్లతో సెంచరీతో కదం తొక్కాడు. ఆల్‌రౌండర్లు జడేజా, సుందర్ సహకారంతో జట్టు స్కోరును 350 దాటించాడు. 99 రన్స్ వద్ద ఫోర్ కొట్టి టెస్టుల్లో ఘనంగా తొలి సెంచరీ నమోదుచేశాడు. ఈ సందర్భంగా ప్రేక్షకుల్లో ఉన్న నితీశ్ తండ్రి భావోద్వేగానికి లోనయ్యారు. కుమారుడి శతకం చూసిన ఆనందంతో కన్నీరు పెట్టుకున్నారు. ఎనిమిదో స్థానంలో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి నితీష్‌రెడ్డి 104 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710